బుధవారం
27-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 36
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఏపీ అప్పుల మయం

పార్లమెంటు సాక్షిగా బట్టబయలు

- పుట్టిన ప్రతి చోటా అప్పు తెస్తున్నారు
- మూడు నెలల్లోనే 50 శాతం రుణాలు
- రాజ్యసభలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్పుల చిట్టాను కేంద్ర ప్రభుత్వం మరోసారి పార్లమెంట్ సాక్షిగా బట్టబయలు చేసింది. అనుమతిచ్చిన అప్పులకుగాను ఏపీ కేవలం మూడు నెలల్లోనే సగానికి పైగా రుణాలు తీసుకున్నట్లు వెల్లడించింది. అందినకాడిక ఎడాపెడా రుణాలు తీసుకుంటున్నట్లు కేంద్రం పేర్కొంది. ఏపీ అప్పులపై మంగళవారం రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కేంద్రం, నాబార్డ్ నుంచి ఏపీ రుణాలు పొందినట్లు మంత్రి తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏపీకి నికర రుణ పరిమితి కింద రూ.44,574 కోట్లు రుణం తీసుకునేందుకు కేంద్రం అనుమతిచ్చిందని చెప్పారు. మొదటి 9 నెలలకు రూ.40,803 కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతి లభించినట్లు వివరించారు.ఏప్రిల్ నాటికే అంటే మొదటి మూడు నెలల్లోనే 50 శాతానికి పైగా రుణాలు తీసుకున్నట్లు చెప్పారు.

ఏప్రిల్ వరకే రూ.21,890 కోట్ల రుణాన్ని బహిరంగ మార్కెట్ నుంచి తీసుకున్నట్లుగా కేంద్ర ఆర్థికశాఖ బయట పెట్టింది. ఇది కాక కేంద్రం నుంచి మరో రూ.1,373.47 కోట్ల రుణాన్ని ఏపీ తీసుకున్నదని తెలిపింది. నాబార్డ్ నుంచి రూ.40.17 కోట్లు అప్పు చేసినట్లు వెల్లడించింది. ఇదే అప్పుల విషయమై సోమవారం కూడా పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బీజేపీ ఎంపీ ప్రశ్నకు సమాధానంగా ఏపీ ఇప్పటివరకు బహిరంగ రుణం రూ.3.98 లక్షల కోట్లు తీసుకోగా, కేంద్రం ఇచ్చిన రుణ పరిమితిని ఉల్లంఘిస్తూ పక్కదారుల్లో కార్పొరేషన్‌ల ద్వారా తీసుకున్న రుణాలను రాష్ట్ర అప్పులుగానే పరిగణిస్తామని తేల్చిచెప్పిన విషయం తెల్సిందే.

అప్పులపై ప్రతిపక్షం దుష్ప్రచారం: మంత్రి బుగ్గన



ప్రజల్లో భయాందోళనలు సృష్టించే దురుద్దేశంతో రాష్ట్ర అప్పులపై దుష్ప్రచారం జరుగుతోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు. వివిధ రాష్ట్రాల అప్పులపై పార్లమెంటులో ప్రశ్న అడిగితే..అదేదో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి మాత్రమే అడిగినట్లుగా చిత్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అప్పులు ఎక్కువగా చేశారని మంత్రి గుర్తు చేశారు. అనవసర అప్పులు ఆ కాలంలోనే ఎక్కువగా జరిగాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము చేసిన అప్పుల శాతం చాలా తక్కువన్నారు. కర్ణాటకలో సగటున ఏడాదికి అప్పుల భారం రూ.60 వేల కోట్లు, తమిళనాడులో రూ.లక్ష కోట్ల అప్పు పెరిగింది. జనాభా దామాషా ప్రకారం చూసినా, మరే విధంగా చూసినా ఏపీ అప్పుల తీరు చాలా తక్కువ అని విశ్లేషించారు. స్థూల ఉత్పత్తిలో పోల్చితే తమ హయాంలో చేసిన అప్పులు తక్కువేనన్నారు. ఏడాదికి 15 నుంచి 16శాతం వరకు అప్పు పెరిగితే మిగతా రాష్ట్రాల్లో 20శాతం వరకు పెరిగిందని మంత్రి మీడియాకు వివరించారు.

తక్షణమే జోక్యం చేసుకోవాలి...

మితిమీరిన దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
రాజకీయ ప్రత్యర్థులపై కేంద్రం కక్షసాధింపు
రాష్ట్రపతికి విపక్షాల లేఖ

న్యూఢిల్లీ:
కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ప్రతిపక్ష పార్టీలు మంగళవారం ఆరోపించాయి. స్వప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను మితిమీరి దుర్వినియోగిస్తోందని, రాజకీయ ప్రత్యర్థులపై వాటిని అస్త్రాలుగా ప్రయోగిస్తోందని దుయ్యబట్టాయి. ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ముర్మును కోరారు. ఈమేరకు కాంగ్రెస్, సీపీఎం, డీఎంకే, ఎస్పీ, ఆప్, ఆర్జేడీ తదితర పార్టీల నేతలు ఆమెకు లేఖ రాశారు. కేంద్రప్రభుత్వ నిరంకుశత్వం, మొండి వైఖరిని ప్రస్తావించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జీఎస్టీ పెంపు, అధిక ధరలపై అత్యవసర చర్చకు అనుమతివ్వడం లేదని, రాజకీయ ప్రత్యర్థులపై వ్యవస్థాగత కక్షసాధింపు సాగుతోందని రాష్ట్రపతి దృష్టికి తీసుకు వెళ్లారు. చట్టం అనేది నిర్భయంగా, నిష్పాక్షికంగా అమలు కావాలేగానీ ఇప్పుడు జరుగుతున్నట్లు కాదన్నారు.

ప్రతిపక్ష పార్టీల ప్రముఖ నేతల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కేంద్రప్రభుత్వ చర్యలు ఉన్నాయని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా రాజకీయంగా పోరాడుతున్న దళాలను బలహీనపర్చాలని, వారి గౌరవమర్యాదలను మంటగలిపే ఉద్దేశంతోనే కేంద్రం ఇదంతా చేస్తోందని ఆరోపించారు. తద్వారా నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తోందన్నారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చలకు అనుమతి ఇవ్వడం లేదని, ప్రభుత్వ మొండి వైఖరితో వర్షాకాల సమావేశాలలో ప్రతిష్ఠంభన కొనసాగుతోందని రాష్ట్రపతికి విపక్ష నేతలు తెలిపారు. పార్లమెంటులో తక్షణమే చర్చించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయన్నారు. అన్ని వ్యవహారాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రపతి తక్షణమే స్పందించాలని తమ లేఖలో ప్రతిపక్షాలు కోరాయి.

మద్యం పాలసీపై హైకోర్టులో పిటీషన్

విచారణ 10కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
బార్ల మద్యం పాలసీపై ప్రభుత్వ జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు మంగళవారం వాదనలు వినిపించారు. అయితే మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. బుధవారం నుంచి వేలం ప్రారంభం అవుతున్నందున నాన్ రిఫండబుల్ డిపాజిట్ చెల్లించాల్సి ఉందని న్యాయవాదులు పేర్కొన్నారు. డిపాజిట్ తిరిగి ఇవ్వబోమని ప్రభుత్వం చెబుతోందని, అది నిబంధనలకు విరుద్ధమని, అందువల్ల దీనిపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటీషనర్ తరపు న్యాయవాది కోరారు. దానికి నిరాకరించిన ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఆగస్టు 10వ తేదీకి వాయిదా వేసింది.

ఏపీ ఈఏపీసెట్‌లో అబ్బాయిల హవా

- ఇంజినీరింగ్-89.12, వ్యవసాయం-95.06 శాతం అర్హత
- ఇంజినీరింగ్‌లో సాత్విక్‌కు... వ్యవసాయంలో దినేష్ కార్తీక్‌రెడ్డికి ప్రథమం
- రెండు వారాల్లోనే ఫలితాలు: మంత్రి బొత్స సత్యనారాయణ

8లో

నేడు మూడో రౌండు

ఆరుగంటలు సాగిన సోనియాగాంధీ విచారణ

2లో

కార్పొరేట్ల కుస్తీ

- 5జీ స్పెక్ట్రమ్ వేలం ప్రారంభం
- 72 గిగాహెర్ట్జ్ సామర్థ్యంగల రేడియో తరంగాలు
- విలువ రూ.4.3 లక్షల కోట్లు
- రిలయన్స్, ఎయిర్‌టెల్, వోడాఫోన్, అదానీ మధ్య పోటీ

న్యూఢిల్లీ :
5జీ టెలికం స్పెక్ట్రమ్ వేలం మంగళవారం ప్రారంభమైంది. ఈ స్పెక్ట్రమ్ వేలంలో రూ.4.3 లక్షలకోట్ల 72 గిగాహెర్ట్జ్ సామర్థ్యంగల 5జీ రేడియోతరంగాలను అమ్మకానికి పెట్టారు. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో, సునీల్ మిట్టల్‌కు చెందిన భారతీ ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా, గౌతమ్ అదానీకి చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రధాన బిడ్డర్లుగా ఉన్నాయి. 5జీ వేగం 4జీ కంటే పది రెట్లు ఎక్కువగా ఉంటుంది. అల్ట్రా హైస్పీడ్, నిరంతరాయ కనెక్టివిటీకి తోడు అల్ట్రా లో లేటెన్సీ (ఒక చోట నుంచి ఒక చోటికి డేటా అతి తక్కువ సమయంలో చేరుకోవడం) కనెక్షన్లకు బలపర్చడం, హై క్వాలిటీ ఫుల్ లెంగ్త్ వీడియో లేదా మూవీని మొబైల్ ద్వారా కొన్ని సెకండ్లలో డౌన్‌లోడ్ చేసుకోవడానికి దోహదం అవుతుంది. ఐదవ తరం లేదా 5జీ ద్వారా ఈ-

- మిగతా 2 లో

19 మంది ఎంపీలపై వేటు

- శుక్రవారం వరకూ సస్పెన్షన్
- రాజ్యసభలో నిరసనల హోరు
- ధరల పెరుగుదల, దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై ఆగ్రహం
- లోక్‌సభలోనూ ఇదే తీరు

న్యూఢిల్లీ:
సభా కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నారన్న కారణంతో 19 మంది ప్రతిపక్ష ఎంపీలను మంగళవారం రాజ్యసభ నుంచి సస్పెండ్ చేశారు. శుక్రవారం వరకూ సస్పెన్షన్ అమలులో ఉంటుందని డిప్యూటీ చైర్మన్ ప్రకటించారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన జులై 18వ తేదీ నుంచి ప్రతిపక్ష ఎంపీలు సభను జరగనివ్వడం లేదు. ధరల పెరుగుదల, నిత్యావసర వస్తువులపై జీఎస్టీ భారం వంటి అనేక అంశాలపై మోదీ సర్కారును సభలో నిలదీస్తున్నారు. డిప్యూటీ చైర్మన్ హర్‌వంశ్ ఆదేశాలను లెక్కచేయకపోవడం, పదేపదే వెల్‌లోకి దూసుకుపోవడం, తమ తమ సీట్లలో కూర్చోవాలన్న విజ్ఞప్తులను పట్టించుకోపోవడంతో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారు. పది మంది ఎంపీలను సస్పెండ్ చేయాలని పార్లమెంటరీ

- మిగతా 2 లో

మోదీ సర్కారు అహంకారం

ఎంపీల సస్పెన్షన్‌పై సీపీఐ మండిపాటు

న్యూఢిల్లీ:
రాజ్యసభ నుంచి 19 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడంపై సీపీఐ మంగళవారం ఆగ్రహం వ్యక్తంచేసింది. మోదీ సర్కారు అహంకారపూరిత, నిరంకుశ చర్యను తీవ్రంగా ఖండించింది. కీలక అంశాల నుంచి తప్పించుకునేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించింది. అనుచితంగా వ్యవహరించారన్న సాకుతో 19మంది ఎంపీలను సస్పెండ్ చేయడంపై సీపీఐ స్పందించింది. ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువులపై జీఎస్టీ అమలు వంటి కీలక సమస్యలపై చర్చకు డిమాండ్ చేసినందుకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అన్ని విధాలా ఆదుకుంటాం

- సాయంలో వెనక్కి తగ్గం
- వరద బాధితులకు సీఎం జగన్ భరోసా
- వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన
- బాధితులకు ఓదార్పు

విశాలాంధ్ర-పి గన్నవరం:
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డా.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ట్రాక్టర్‌పై తిరుగుతూ బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అందించిన సహాయ చర్యలపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని సీఎం పరిశీలించారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ పి.గన్నవరం మండలంలోని బూరుగులంక, గంటిపెదపూడి లంక, అరిగెలవారి పేట, ఉడిమూడి లంక గ్రామాలకు రాకపోకలకు అనువుగా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తొలుతగా గంటి పెదపూడిలంకలో వరద ముంపు బాధితులను ఆయన పరామర్శించారు. ప్రభుత్వ సాయంగా 25 కేజీల బియ్యం, లీటరు పామాయిల్, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు సక్రమంగా అందిందా లేదా అని బాధితులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సాయమందించడంలో అధికారులు కష్టపడ్డారన్నారు. సహాయ, పునరావాస కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగించారన్నారు. ప్రభుత్వ సాయం రూ.2వేలు అందిందా లేదా అని బాధితులను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రాంతాల్లో పశువులకు సైతం నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ వరద సహాయక చర్యల్లో కలెక్టర్ నుంచి వలంటీర్ వరకు అంకితభావంతో, మానవతా

- మిగతా 2 లో

మా నోళ్లు కట్టేయలేరు

- ఇది పోలీసు రాజ్యం- మోదీ నియంత : రాహుల్ ఆగ్రహం
- ఖాకీ జులుం: మోదీ-షా కుట్ర - కాంగ్రెస్ నేతల అసహనం
- సోనియాగాంధీ విచారణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు
- రాహుల్ సహా కాంగ్రెస్ ఎంపీల అరెస్టు

న్యూఢిల్లీ:
కేంద్రప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని కాంగ్రెస్ నేతలు తేల్చిచెప్పారు. తమ మనోధైర్యానికి స్ఫూర్తికి విఘాతం కలిగించలేరని కేంద్రానికి స్పష్టంచేశారు. అధినేత్రి సోనియాగాంధీని మనీలాండరింగ్ కేసులో ఈడీ విచారించడానికి నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో

- మిగతా 2 లో

ఇటలీలో టీయూలకు మద్దతుగా ర్యాలీ

ఇటలీ: ట్రేడ్ యూనియన్లపై వేధింపులను నిరసిస్తూ వారికి మద్దతుగా ఇటలీలోని పియాసెంజాలో పెద్దఎత్తున నిరసన జరిగింది. ఇటలీ ఉత్తర ప్రాంతంలోని ఎమిలియా రొమాగ్నాలోని పియాసెంజాలో జరిగినని భారీ ప్రదర్శనలో వేలాది మంది కార్మికులు, పురుషుల, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గృహనిర్బంధంలో ఉన్న ఎనిమిది ట్రేడ్ యూనియన్ కార్యకర్తలను, సి కోబాస్, యూఎస్‌బీ యూనియన్ కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యుఎస్‌బి, సి కోబాస్ యూనియన్‌లకు వ్యతిరేకంగా పియాసెంజా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం చేపట్టిన నేరారోపణ ఆధారంగా ట్రేడ్ యూనియన్ కార్యకర్తలను జూలై 19న గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. బహుళజాతి సంస్థల గిడ్డంగుల వద్ద సమ్మెలు నిర్వహించడం, అయుధాలను కలిగిఉన్నారన్న నెపంతో వీరిపై పోలీసు అధికారులు యుఎస్‌బీ జాతీయ ప్రధాన కార్యాలయంపై దాడి చేశారు. ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగించే మందుగుండు సామగ్రి, ఆయుధాలను పంపడానికి జెనోవా వంటి ఇటాలియన్ నౌకాశ్రయాలను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ యుఎస్‌బీ ట్రేడ్ యూనియన్ నిర్వహించిన నిరసనలపై పోలీసుల దాడి జరిగింది. జూలై 20న విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో సికోబాస్, యూఎస్‌బీ ఇతర ట్రేడ్ యూనియన్‌లు పెద్ద ఎత్తున రాజకీయ దాడిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నాయి. పెట్టుబడిదారీ సంక్షోభ పురోగతి, యుద్ధ ఆర్థిక వ్యవస్థ, అధిక జీవన వ్యయం, పెరుగుతున్న సామాజిక అనారోగ్యం, కార్మికులపై ముఖ్యంగా ట్రేడ్ యూనియన్‌లపై పెరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ), ఫంట్ ఆఫ్ కమ్యూనిస్ట్ యూత్ సంఘీభావం ప్రకటించింది. వీరిపై నమోదుచేసిన ఆరోపణల నుండి కార్మికులను తక్షణమే నిర్దోషులుగా ప్రకటించాలని, గృహనిర్బంధంలో ఉన్న కార్మిక సంఘాలను విడుదల చేయాలనే డిమాండ్ చేసింది. ఇటలీలో ట్రేడ్ యూనియన్ చర్యలను నేరంగా పరిగణించే ప్రయత్నాలను పీఏఎమ్‌ఈ ఖండించింది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఇటలీలోని ట్రేడ్ యూనియనిస్టుల పక్షాన నిలబడాలని ఇటువంటి దాడులను ఖండిస్తూ నిరసన తెలియజేయాలని దాని అనుబంధ సంస్థలకు పిలుపునిచ్చింది.

హిందువులు, సిక్కులు తిరిగి రండి : తాలిబన్

కాబూల్ : హిందువులు, సిక్కులు అఫ్ఘాన్‌కు తిరిగి రావాలని తాలిబన్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దేశంలో భద్రతా సమస్యలు పరిష్కరించామని, మైనారిటీలు వెనక్కు రావాలని కోరింది. ఈ నెల 24వ తేదీన తాలిబన్ మంత్రి కార్యాలయ డైరెక్టర్ జనరల్ డా.ముల్లా అబ్దుల్ వసి అఫ్ఘాన్‌లోని హిందు, సిక్కు కౌన్సిల్‌లతో సమావేశమైన అనంతరం ఈ నిర్ణయం ప్రకటించడమైందని చీఫ్ ఆఫ్ స్టాఫ్ ట్వీట్ చేశారు. భద్రతా సమస్యల కారణంగా దేశాన్ని విడిచి వెళ్లిన భారతీయ, సిక్కు స్వదేశీయులందరూ తిరిగి రావాలని పేర్కొన్నారు. కాబూల్‌లోని గురుద్వారాపై ఇస్లామిక్ స్టేట్ ఖరాసన్ ప్రావిన్స్ (ఐఎస్‌కెపి) దాడిని అడ్డుకున్నందుకు సిక్కు నేతలు తాలిబన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా క్యూబా తిరుగుబాటు దినోత్సవం

హవానా : క్యూబా మంగళవారం జాతీయ తిరుగుబాటు దినోత్సవాన్ని అత్యంత ఘనంగా జరుపుకుంది. మోన్‌కాడా, కార్లోస్ మాన్యువల్ డి సెస్పెడెస్ సైనిక బ్యారక్‌లపై దాడులు జరిగిన 69 సంవత్సరాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్మీ జనరల్, క్యూబా విప్లవ నాయకుడు రౌల్ కాస్ట్రో, అధ్యక్షుడు కానెల్, ప్రధాని మాన్యుయెల్ మారెరో ఇతర అధికారులు రాజకీయ కార్యక్రమానికి హాజరయ్యారు. దీనికి దాదాపు 10,000 మంది హాజరయ్యారు. జులై 26, 1953 ఆదివారం తెల్లవారుజామున, శాంటియాగో డి క్యూబాలో జరిగిన సైనిక బ్యారెల్స్‌పై జరిగిన దాడుల్లో 131 మంది యువ పోరాట యోధులు, 16 కార్లలో ఆర్మీ యూనిఫారాలు ధరించి, కాస్ట్రో నేతృత్వంలో మోంకడా బ్యారక్స్‌పై దాడి చేశారు. ఈ తిరుగుబాటు కొత్తతరం క్యూబన్‌లను ప్రపంచానికి తెలియజేశాయి. ఈ సందర్భంగా ప్రతి ఏడాది జూలై 26న క్యూబన్లు జాతీయ తిరుగుబాటు దినోత్సవాన్ని జరుపుకుంటారు. అదే రోజు అదే సమయంలో, 28 మంది విప్లవకారులు బయామోలోని కార్లోస్ మాన్యువల్ డి సెస్పెడెస్ బ్యారక్‌పై దాడి చేశారు... ఈ రెండు చర్యల లక్ష్యం బాటిస్టా నియంతృత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని ప్రారంభించడం. ఈ పోరాటం బ్యారక్స్ వెలుపల ప్రారంభమైంది. సుదీర్ఘంగా కొనసాగింది, ఇందులో సైనికులు విజయం సాధించారు. ప్రజల సహాయంతో తప్పించుకోగలిగిన కొంతమంది పోరాట యోధులు తప్ప, చాలా మంది తిరుగుబాటుదారులు పట్టుబడ్డారు. వారిలో ఎక్కువ మంది తరువాతి రోజుల్లో చంపబడ్డారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

దృక్పథంతో మానవీయ కోణంలో పనిచేశారని కొనియాడారు. బాధితులకు వారం రోజుల్లో పూర్తిస్థాయిలో సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న గృహాలు, పంటలు, ఉద్యానతోటల నష్టపరిహారం అంచనాపై నివేదిక అందిన వెంటనే పరిహారం అందిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి చేయాలనే తపనతో ప్రభుత్వం, అధికారులు పనిచేస్తున్నారన్నారు. బాధిత కుటుంబాలలో ఒక్కరికీ పరిహారం అందలేదన్న మాట వినపడకూడదని ఆయన సూచించారు. అంకితభావంతో పనిచేసిన కలెక్టర్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. లంక గ్రామాలను అనుసంధానం చేసే వంతెనకు త్వరలో శంకుస్థాపన చేస్తానని గ్రామస్తులకు వివరించారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా జులైలో వరద రావడంతో అరటి, మిర్చి, బెండ వంటి కూరగాయలకు తీవ్ర నష్టం వాటిల్లిందని జగన్‌కు రైతులు వివరించారు. బెండ, మిర్చి పంటలు రెండో కోతకు రాకుండానే ముంపు బారిన పడటంతో బాగా నష్టపోయామని చెప్పారు. తన భర్త ప్రమాదానికి గురికావడంతో తాము తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని సురేంద్ర భార్య జ్యోతి సీఎం దృష్టికి తీసుకురాగా..ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం వెంట రాష్ట్ర మంత్రులు విశ్వరూప్, సీహెచ్ శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేశ్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సీఎం పర్యటన సమన్వయ కర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, జక్కంపూడి రాజా, పొన్నాడ వెంకట సతీశ్ కుమార్, జడ్‌పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వరద సహాయక చర్యల ప్రత్యేక అధికారి డి.మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రాజోలు వచ్చారు..వెళ్లారు

విశాలాంధ్ర-రాజోలు: సీఎం జగన్ రాజోలు పర్యటన..వచ్చారు-వెళ్లారు అన్న చందంగా జరిగింది. రాజోలులోని మేకలపాలెంలో పర్యటించిన సీఎం.. ఏటిగట్టును ఆనుకొని ఉన్న వరద బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ సహాయం అందిందా అని అడిగి తెలుసుకున్నారు. ఏటిగట్టుపై నివాసం ఉంటున్న నాగరాజు కుటుంబాన్ని పలకరించారు. తన ఇంటి సమస్యలను ఆయన సీఎంకు వివరించారు. వెంటనే అతనికి ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ సీఎం వెంట చెల్లుబోయిన వేణు, పినిపే విశ్వరూప్ సహా స్థానిక ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఉన్నారు. రాజోలు మండలంలో అసలైన వరద బాధితులు నున్నవారి బాడవ వద్ద ఉన్నారు. అక్కడ ఏటిగట్టు అభివృద్ధికి నోచుకోలేదు. వరద సమయంలో ఏటిగట్టు బలహీనంగా ఉండటంతో రాజోలు ప్రజలకు కంటిమీద కునుకులేదు. అటువంటి చోట సీఎం పర్యటించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కార్పొరేట్ల కుస్తీ

(మొదటిపేజీ తరువాయి)

హెల్త్, కనెక్టెడ్ వెహికిల్స్, ఇమ్మెర్సివ్ అగ్మెంటెడ్ రియాలిటీ, మెటావర్స్ ఎక్స్‌పీరియన్స్, లైఫ్ సేవింగ్, అడ్వాన్స్‌డ్ మొబైల్ క్లౌడ్ గేమింగ్ తదితర సేవలు అందుబాటులోకి వస్తాయి. 5జీ స్పెక్ట్రమ్‌లో తక్కువ స్థాయిలో (600 మెగా హెట్జ్, 700 ఎంహెచ్‌జెడ్, 800 ఎంహెచ్‌జెడ్, 900 ఎంహెచ్‌జెడ్, 1800 ఎంహెచ్‌జెడ్, 2100 ఎంహెచ్‌జెడ్) ఉంటే మధ్య స్థాయిలో 3,300 ఎంహెచ్‌జెడ్ ఫ్రీక్వెన్సీ ఉంటుంది. అత్యధిక స్థాయిలో 26 జీహెచ్‌జెడ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్లు ఉన్నాయి. వీటి వేలం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగగా డిమాండు క్రమంలో బుధవారం కూడా కొనసాగుతుంది. రేడియో తరంగాలకు డిమాండు, బిడ్డర్ల వ్యూహం తదితర అంశాలను బట్టి వేలం సమయం ఆధారపడి ఉంటుందిగానీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్న ఏకాభిప్రాయం పరిశ్రమ వర్గాల్లో కుదిరింది. వేలంలో విజయం సాధించిన కంపెనీ 5జీ సేవలను అందించగలుగుతుంది. 5జీ స్పెక్ట్రమ్ వేలం రూ.70వేల కోట్ల నుంచి రూ.1,00,000 కోట్ల వరకు వెళ్లవచ్చు అని టెలికం సంస్థ అంతర్గత అంచనా. వేలంలో జియో అగ్రస్థానంలో నిలుస్తుందని,తర్వాత భారతి ఎయిర్‌టెల్ ఉంటుందని, వోడాఫోన్ ఐడియా, అదానీ గ్రూపు పరిమితంగా బిడ్డింగ్ చేస్తాయని విశ్లేషకులు అంచనా వేశారు. బిడ్డర్ల జాబితా ప్రకారం రిలయన్స్ జియో రూ. 14,000 జమ చేయగా, అదానీ డేటా నెట్వర్క్ రూ. 100 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్ రూ. 5,500 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ. 2,200 కోట్లు జమ చేశాయి. ఈ క్రమంలో జియో రూ.1.27లక్షల కోట్ల వరకు బిడ్డింగ్ చేసేందుకు వీలు ఉందని మార్కెట్ పరిశీలకులు అంచనా వేశారు. అదే విధంగా భారతి ఎయిర్‌టెల్ రూ.48,000 కోట్లు, వోడాఫోన్ ఐడియా రూ.20,000 కోట్లు, అదానీ డేటా రూ.700 కోట్ల వరకు బిడ్ చేయొచ్చు అని వారు పేర్కొన్నారు.

ఎయిర్ ఇండియా సీఈవోగా కాంప్‌బెల్ విల్సన్ అనుమతిచ్చిన హోంశాఖ

న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియా సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు ఆ పదవికి నియమితులైన కాంప్‌బెల్ విల్సన్‌కు లైన్ క్లియర్ అయింది. అవసరమైన భద్రతాపరమైన అన్ని అనుమతులను హోంశాఖ తాజాగా జారీ చేసినట్లు సీనియర్ అధికారి మంగళవారం తెలిపారు. ఎయిర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విల్సన్ నియామకాన్ని టాటా సన్స్ మే 12న ప్రకటించింది. ఎయిర్ ఇండియా సంస్థను జనవరి 27న టాటా సన్స్ దక్కించుకుంది. అప్పుల్లో కూరుకున్న ఈ సంస్థను టేకోవర్ చేసింది. టర్కిష్ ఎయిర్‌లైన్స్ మాజీ చైర్మన్ ఇల్కర్ ఐసీని ఎయిర్ ఇండియా ఎండీ, సీఈవోగా తొలుత పేర్కొంది. ఇల్కర్ ఏప్రిల్ 1న పదవీ బాధ్యతలు చేపట్టాల్సి ఉండగా తన నియామకంపై కొన్ని వర్గాల్లో అసంతృప్తి క్రమంలో గ్రూపులో చేరకూడదన్న నిర్ణయాన్ని ఆయన తీసుకున్నారు. దీంతో విల్సన్‌ను ఆ పదవి కోసం టాటా గ్రూపు ఎంపిక చేసింది. విల్సన్ గతంలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ సీఈవోగా పనిచేశారు. 2011లో సింగపూర్‌కు వచ్చేందుకు ముందు కెనడా, హాంగ్‌కాంగ్, జపాన్ దేశాల్లో స్కూట్ ఎయిర్ వ్యవస్థాగత సీఈవోగా సేవలు అందించారు. 2016 వరకు ఆ పదవిలో కొనసాగారు. సింగపూర్ ఎయిర్‌లైన్స్ సీనియర్ ఉపాధ్యక్షుడు (సేల్స్, మార్కెటింగ్)గా వ్యవహరించారు. 2020 ఏప్రిల్‌లో స్కూట్ సీఈవోగా తిరిగి బాధ్యతలు చేపట్టారు. 26 ఏళ్లకుపైగా అనుభవాన్ని కలిగివున్న విల్సన్‌ను ఎయిర్ ఇండియా సీఈవోగా నియమిస్తూ టాటా సన్స్ ప్రకటన చేసింది. జూన్ 20న ఎయిర్ ఇండియా ఉద్యోగులను ఉద్దేశించి ఒక సందేశాన్ని విల్సన్ పంపారు. రాబోతున్నవి అద్భుత సంవత్సరాలని, ప్రపంచస్థాయి విమానయాన సంస్థగా ఎదగాలని అందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో ఎయిర్ ఇండియాకు చెందిన వేర్వేరు కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందిని కలిసి పరిస్థితులను సమీక్షించారు. ఎయిర్ ఇండియాను 1932లో టాటా గ్రూపు ప్రారంభించగా 1953తో జాతీయాకరణ క్రమంలో అది ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లింది.

మా నోళ్లు కట్టేయలేరు

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు భారీఎత్తున మంగళవారం జరిగాయి. ఈ క్రమంలో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. విజయ్ చౌక్ వద్ద ధర్నాలో పాల్గొన్న అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు అందరు కాంగ్రెస్ ఎంపీలను పోలీసులు అరెస్టు చేసి వేర్వేరు బస్సుల్లో తరలించడం ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరిపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. విజయ్ చౌక్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు మార్చ్ నిర్వహించి, రాష్ట్రపతికి వినతిపత్రాన్ని సమర్పించాలని కాంగ్రెస్ నేతలు భావించగా పోలీసులు వారిని నిలువరించారు. ఎక్కడికక్కడ నేతలను అరెస్టు చేశారు. దీంతో 'ఇది పోలీసు రాజ్యం.. దీనికి మోదీ రాజు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. పార్లమెంటులో కీలక అంశాలపై చర్చలను సైతం నిరాకరిస్తున్నారని ఆరోపించారు. 'మేము ఎక్కడికో వెళ్లిపోవడం లేదు. కేవలం రాష్ట్రపతి భవన్ వరకు వెళ్లాలని అనుకున్నాంగానీ పోలీసులు అనుమతివ్వలేదు. ఈ నిరంకుశత్వాన్ని చూడండి. శాంతియుతంగా నిరసన తెలపడానికీ లేదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై చర్చలకూ అనుమతి లేదు. పోలీసులను, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగిస్తూ మమ్మల్ని అరెస్టు చేయిస్తారు. మా నోళ్లు నొక్కేయలేరు. ఎప్పటికైనా సత్యమే ద్వారానే ఈ నిరంకుశత్వానికి అంతం' అని రాహుల్ ట్వీట్ చేశారు. తాను నిరసన తెలుపుతున్న దృశ్యాలను పోస్టు చేశారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, తప్పుడు జీఎస్టీ, అగ్నిపథ్‌పై ఎవరైనా ప్రశ్నిస్తే వారిని జైళ్లల్లో పెట్టండి అని 'రాజు' ఆదేశించారని మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'ఇప్పుడు నేను కస్టడీలో ఉండొచ్చు. దేశంలో ప్రజల పక్షాన గళమెత్తడం నేరంగా పరిగణించవచ్చు.. కానీ మా స్ఫూర్తికి విఘాతం కలిగించలేరు' అని రాహుల్ హిందీలో మరొక ట్వీట్ చేశారు. తనతో పాటు మరికొందరు కాంగ్రెస్ ఎంపీలతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించినట్లు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇదంతా మోదీ-షా ద్వయం కుట్ర అని వారిద్దరి కనుసన్నల్లో జరుగుతోందని అరెస్టు సమయంలో ఖర్గే వ్యాఖ్యానించారు. 'మమ్మల్ని అణచివేసినా అరెస్టు చేసినా మా మనోధైర్యాన్ని తగ్గించలేరు. మా స్ఫూర్తికి విఘాతం కలిగించలేరు. బీజేపీ అణచివేతను ప్రతిఘటిస్తాం' అని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ఉద్ఘాటించారు. విజయ్ చౌక్ వద్ద కాంగ్రెస్ ఎంపీలు అందరినీ పోలీసులు అడ్డుకున్నారని, బలవంతంగా అరెస్టు చేసి వేర్వేరు పోలీసు బస్సుల్లో తరలిస్తున్నారని, ఎక్కడికి తీసుకెళుతున్నారో ప్రధానికి, హోంమంత్రి మాత్రమే తెలుసు అని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. ఢిల్లీ పోలీసులు వేధించారని, దాదాపు 75 మంది ఎంపీలను అదుపులోకి తీసుకొన్నారని మాణిక్‌రాం ఠాకూర్ వెల్లడించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ రాష్ట్రపతికి వినతిపత్రాన్ని సమర్పించాలని అనుకుంటే పోలీసులు అడ్డుకొని రాహుల్‌తో పాటు అందరిని అదుపులోకి తీసుకున్నారని ఎర్నాకులం ఎంపీ హిబీ ఎడెన్ తెలిపారు. కాంగ్రెస్ ఎంపీలు అంతా తొలుత పార్లమెంటు కాంపెక్స్‌లో సమావేశమై ఈడీ ఎదుట సోనియాగాంధీ రెండవసారి హాజరుకానున్న నేపథ్యంలో తమ తదుపరి కార్యాచరణపై చర్చించారు. కాంపెక్స్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. మహాత్మాగాంధీ స్మారకం రాజ్‌ఘాట్ వద్ద సత్యాగ్రహం చేసేందుకు తమకు అనుమతిని ఇవ్వలేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అజయ్ మాకేన్ తెలిపారు.

19మంది ఎంపీలపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారాల సహాయమంత్రి వి.మురళీధరన్ ప్రతిపాదించినప్పటికీ మూజువాణి ఓటు పేరుతో 19 మంది ఎంపీల పేర్లను హర్‌వంశ్ చదివి వినిపించారు. సస్పెన్షన్‌కు గురైన ఎంపీలంతా సభను వదిలి వెళ్లాలని కోరారు. ఎంపీలను శుక్రవారం వరకూ సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఏడుగురు తృణమూల్, ఆరుగురు డీఎంకే, ముగ్గురు టీఆర్ఎస్, ఇద్దరు సీపీఎం, ఒక సీపీఐ ఎంపీ ఉన్నారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్, సీపీఎం ఎంపీలు వి.శివదాసన్, ఏఏ రహీం, టీఆర్ఎస్ ఎంపీలు బి.లింగయ్య యాదవ్, రవిచంద్ర వద్దిరాజు, దామోదరరావు దివకొండల ఉన్నారు. సభ పట్ల ఎంపీల ప్రవర్తన బాగా లేదని, చైర్మన్ స్థానాన్ని అగౌరవ పరిచారని హర్‌వంశ్ అన్నారు. సభ నుంచి బయటికి వెళ్లాల్సిందిగా హర్‌వంశ్ ఆదేశించినా సభ్యులు బయటికి వెళ్లలేదు. దీంతో సభను డిప్యూటీ చైర్మన్ వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైనా సభ అదుపులోకి రాలేదు. ఎంపీల సస్పెన్షన్‌పై రాజ్యసభలో దుమారం రేగింది. ఆ సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. సభ నిర్వహణకు ఏమాత్రం అవకాశం లేకుండా చేయడంతో డిప్యూటీ చైర్మన్ చివరికి సభను బుధవారానికి వాయిదా వేశారు.

ప్రశ్నోత్తరాలకు ఆటంకం

అంతకుముందు ప్రశ్నోత్తరాలకు విపక్ష సభ్యులు ఆటంకం కలిగించారు. ధరల పెరుగుదల సహా అనేక అంశాలపై చర్చించాలని పట్టుబట్టారు. విపక్షాల నిరసనల మధ్యే ప్రశ్నోత్తరాలు నిర్వహించడానికి సభాధ్యక్షుడు ప్రయత్నించాడు. సభ 12 గంటలకు తిరిగి ప్రారంభం కావడంతో డిప్యూటీ చైర్మన్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. సభ్యులు తమ తమ సీట్లలో కూర్చోవాలని, సభ నిర్వహణకు సహకరించాలని హర్‌వంశ్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే సహా ఇతర ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. నిరసనలు కొనసాగడంతో 15 నిమిషాలు సభను వాయిదా వేశారు. ఆప్, టీఎంసీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 267వ నిబంధన కింద చర్చకు అనుమతించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ నిబంధనకు అనుమతిస్తే ఇతర కార్యకలాపాలన్నీ నిలిపివేసి..విపక్షాలు డిమాండ్ చేసిన అంశాలపై చర్చ చేపట్టాల్సి ఉంటుంది. 'మోదీగారు సమాధానం చెప్పు', 'జీఎస్‌టీని వెనక్కి తీసుకో', 'గుజరాత్ సీఎం రాజీనామా చేయాలి' అంటూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేశారు.

లోక్‌సభలోనూ నిరసనలు

లోక్‌సభలోనూ విపక్షాల సభ్యులు ఆందోళన కొనసాగించారు. ధరల పెరుగుదల, మోదీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంపై చర్చించాలని డిమాండ్ చేశారు. దీంతో లోక్‌సభ సైతం అనేకసార్లు వాయిదా పడింది. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం అంశం మంగళవారం ప్రధానంగా తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీని ఈడీ ప్రశ్నిస్తున్నందున కాంగ్రెస్ ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. ఉదయం 11 గంటలకు సభ సమావేశం కాగానే స్పీకర్ ఓం బిర్లా కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సభ వాయిదా పడింది. దేశంలో ఈడీ పాలనను సహించేది లేదని విపక్షాలు స్పష్టంచేశాయి.

మోదీ సర్కారు అహంకారం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ ఎంపీ సంతోశ్‌కుమార్ సహా రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయడం దురదృష్టకరమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. కీలక అంశాలపై చర్చించడానికి మోదీ సర్కారు భయపడుతోంది. ప్రజలకు, ప్రతిపక్షాలకు జవాబుదారీగా ఉండకుండా ప్రభుత్వం పార్లమెంటు నుంచి పారిపోతోంది' అని రాజా ట్వీట్ చేశారు.

నేడు మూడో రౌండు సోనియా విచారణ

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ మూడవసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట బుధవారం హాజరుకావాల్సి ఉంది. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యారు. రెండవ రోజు అయిన మంగళవారం ఆరు గంటల పాటు సోనియాగాంధీని అధికారులు విచారించారు. ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉదయం 11 గంటలకు జెడ్ ప్లస్ సాయుధ భద్రతతో ఆమె ఈడీ కార్యాలయానికి చేరుకోగా 11.15 నిమిషాలకు ప్రక్రియ మొదలు అయింది. సమన్ల ధ్రువీకరణ, అటెండెన్స్ షీటుపై సంతకాల అనంతరం ఆమెపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ దాదాపు ఆరు గంటలకుపైగా విచారించినట్లు అధికారులు తెలిపారు. సోనియాగాంధీ వెంట ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వచ్చారని, ప్రియాంక ఉండిపోగా రాహుల్ వెళ్లిపోయారని చెప్పారు. సెంట్రల్ ఢిల్లీలోని ఈడీ కార్యాలయం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు భోజన విరామం తీసుకున్న సోనియాగాంధీ తిరిగి 3.30 గంటలకు విచారణకు హాజరైనట్లు వెల్లడించారు. వైద్యుల సూచన మేరకు సోనియాగాంధీకి సమయానికి మందులు ఇవ్వాల్సిన క్రమంలో ప్రియాంకను వేరొక గదిలో ఉంచినట్లు చెప్పారు. కాగా, 21వ తేదీన దాదాపు రెండు గంటల పాటు సోనియాగాంధీని విచారించగా ఆమె 28 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కోవిడ్ ప్రోటోకాల్ క్రమంలో ఇద్దరు వైద్యులు, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. అలాగే, ఈడీ కార్యాలయానికి కిలోమీటరు దూరం వరకు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కేసులో రాహుల్ గాంధీని ఐదు రోజులు-50 గంటల పాటు విచారించిన విషయం విదితమే.

దేశాన్ని ప్రమాదంలోకి నెట్టిన బీజేపీ ప్రభుత్వం

సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ప్రమాదకర పరిస్థితుల్లోకి తీసుకువెళుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాల్లో కేంద్ర ప్రభుత్వం ఉన్నదని, అందులో భాగంగా కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండాలని, దేశం మొత్తం తన చెప్పు చెత్తల్లో ఉండాలని బీజేపీ ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. దేశ రాజ్యాంగాన్ని, లౌకిక పునాదులను ధ్వంసం చేస్తున్న బీజేపీని అడ్డుకునేందుకు జాతీయ స్థాయిలో లౌకికవాద పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ మఖ్దూం భవన్‌లో మంగళవారం బి.జయసారధి అధ్యక్షతన జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్లా వెంకట్ రెడ్డి, కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఉగ్రవాదం, నల్లధనం, డ్రగ్స్‌ను అంతమొందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎక్కడ కూడా ఉగ్రవాదం సమసిపోలేదని, నల్లధనం రెట్టింపు అయ్యిందని, డ్రగ్స్ విచ్చలవిడిగా రవాణా అవుతున్నాయని విమర్శించారు. అఫ్ఘనిస్తాన్ నుంచి గుజరాత్ ముంద్రా పోర్టుకు, అక్కడి నుంచి దేశం మొత్తం డ్రగ్స్ సరఫరా జరుగుతున్నదన్నారు. స్వతంత్ర వ్యవస్థలయిన సీబీఐ, ఎన్నికల కమిషన్‌ను కేంద్ర సర్కార్ నాశనం చేసిందని తెలిపారు. గతలో సీబీఐ శక్తిమంతంగా ఉండేదని, మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న రాజాను, ఎంపీ కనిమొళిని జైలులో పెట్టారని గుర్తు చేశారు. విజయ్ మాల్యా మినహా బ్యాంకులను ముంచినవాళ్లంతా గుజరాత్ చెందిన వారే అన్నారు. అడవులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు చట్టాలను మారుస్తున్నారని అన్నారు. పోడు భూములకు సంబంధించి న్యాయం చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. ఈ సమస్య పరిష్కారం కోసం కలిసివచ్చే పార్టీలతో పోరాటాలు నిర్వహించాలని నారాయణ తెలిపారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లి పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

విభజన హామీలు అమలు చేయని బీజేపీని నమ్మొద్దు : చాడ

విభజన హామీలను ఒక్కటి కూడా అమలు చేయని బీజేపీ రాష్ట్రంలోకి ఏ ముఖం పెట్టుకొని వస్తుందని చాడ వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. కేవలం మతోన్మాదంతోనే బీజేపీ అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఆదిలాబాద్ సిమెంట్ కంపెనీ, విశాఖ ఉక్కు లాంటి కంపెనీలను కేంద్రం అమ్మకానికి పెట్టిందని, విభజన హామీలయిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటివి ఎనిమిదేళ్లయినా అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల నష్టం చాలా జరిగిందన్నారు. నష్టాన్ని వెంటనే అంచనా వేసి, పరిహారాన్ని తక్షణం విడుదల చేయాలన్నారు. తెలంగాణకు సర్దార్ వల్లభాయ్ పటేల్ కారణంగానే స్వతంత్ర్యం వచ్చిందని బీజేపీ అంటోందని, పటేల్‌కి బీజేపీకి ఏమి సంబంధం అని ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటం జరిగినప్పుడు బీజేపీనే లేదన్నారు. ఆ పార్టీ నేతలు చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. అవసరం కోసం అడ్డమైన దారులూ తొక్కుతున్నారని మండిపడ్డారు. మతోన్మాద శక్తులను నిరంతరం ఎండగట్టాలన్నారు. ధరణి పోర్టల్, పోడు భూములు, ఆసరా పెన్షన్, రేషన్ కార్డులు, దళిత బంధు, ఉద్యోగ ఖాళీలు, ఇంకా అనేక సమస్యలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

మీ వల్ల అవుతుందో లేదో చెప్పండి

ఎన్నికలప్పుడు పార్టీలిచ్చే ఉచిత హామీల నియంత్రణపై కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

ఆగస్టు 3కు విచారణ వాయిదా

న్యూఢిల్లీ : ఎన్నికల సమయాల్లో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలపై సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తంచేసింది. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని సూచించింది. ఎన్నికల ప్రచారాల్లో అహేతుకమైన ఉచిత హామీలు లేదా వస్తువుల పంపిణీ తగదని, ఇందుకు పరిష్కారాన్ని కనుగొనాలని కేంద్రానికి సూచించింది. ఇదే క్రమంలో దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ తమ వైఖరిని వెల్లడించాలని కేంద్రప్రభుత్వాన్ని సీజేఐ ఎన్వీ రమణ, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమా కోహ్లి ధర్మాసనం ఆదేశించింది. ఆర్థిక కమిషన్ సూచనలను తీసుకొని పరిష్కారాన్ని కనుగొనాలని పేర్కొంది. సంబంధిత వేరే వ్యవహారంలో కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అభిప్రాయాన్ని సీజేఐ కోరారు. 'సిబల్ కోర్టులో ఉన్నారు. సీనియర్ పార్లమెంటేరియన్‌గా దీనిపై మీరు ఏమంటారు' అని జస్టిస్ రమణ ప్రశ్నించడంతో 'ఇది తీవ్రంగా పరిగణించాల్సిన అంశమే అయినాగానీ రాజకీయంగా నియంత్రించడం కష్టం. వివిధ రాష్ట్రాలకు కేటాయింపుల సమయంలో ఆయా రాష్ట్రాల అప్పులు, ఉచిత హామీలను ఆర్థిక కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుంది కాబట్టి పరిష్కారానికి కనుగొనేందుకు అదే సరైన యంత్రాంగం. ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని కమిషన్‌ను కోరవచ్చు అని అనుకుంటున్నా. కేంద్రప్రభుత్వం నుంచి నిర్ణయాన్ని ఆశించలేం' అని కపిల్ సిబల్ బదులిచ్చారు. సిబల్ సూచనల దృష్ట్యా ఆర్థిక కమిషన్‌ను సంప్రదించాలని కేంద్ర ప్రభుత్వం తరపు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్‌కు త్రిసభ్య ధర్మాసనం సూచించింది. దీనిపై ఏ విధంగా ముందుకు వెళ్లవచ్చో చూడండి అని పేర్కొంది. తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది. అంతకుముందు భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) తరపున న్యాయవాది అమిత్ శర్మ వాదనలు వినిపిస్తూ రాజకీయ పార్టీల మేనిఫెస్టోల్లో ఇటువంటి హామీలు భాగమని, దీనికి పరిష్కారం కావాలంటే వాటిపై నిషేధం విధించే చట్టాన్ని కేంద్రప్రభుత్వమే తేవాలని అన్నారు. దీనికి నటరాజ్ స్పందిస్తూ ఇది ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని అన్నారు. సీజేఐ జోక్యం చేసుకొని 'మీరు ఏమి చేయలేరని, ఈసీఐయే నిర్ణయం తీసుకోవాలని నేరుగా చెప్పవచ్చుగా? దీనిని తీవ్రమైన అంశంగా ప్రభుత్వం పరిగణిస్తుందో లేదో చెప్పండి. ఆ తర్వాత మేము నిర్ణయిస్తాం. ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించేందుకు ఎందుకని సంకోచిస్తోంది?' అని ప్రశ్నించారు. కాగా, అహేతుకమైన ఉచితాల హామీలపై చర్యలను కోరుతూ, అలాంటి పార్టీ గుర్తింపుల రద్దు డిమాండుతో దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం విచారించింది. రాజకీయ పార్టీలు ఇచ్చిన ఉచిత హామీలపై దృష్టి సారించకపోతే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉందని పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ్ పేర్కొన్నారు. వాదనల అనంతరం కేంద్రప్రభుత్వ వైఖరిని కోరిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఆగస్టు 3కి వాయిదా వేసింది.

ధరలు తగ్గించమంటే కేసులా?

విజయవాడలో కాంగ్రెస్ సత్యాగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ సర్వనాశనం చేస్తున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. కక్షపూరిత రాజకీయాలకు ఇకనైనా స్వస్తి పలకాలని హితవు పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ విజయవాడ ఆంధ్రరత్నభవన్ దగ్గర కాంగ్రెస్ పార్టీ మంగళవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించింది. శైలజానాథ్ మాట్లాడుతూ...రాహుల్ భారత్ జోడో యాత్ర చేపడుతుంటే, బీజేపీ నేతలకు వణుకు పుడుతోందన్నారు. రాహుల్ గాంధీ ధరలను తగ్గించాలని అడిగినందుకు అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కావాలని సోనియా, రాహుల్ పేర్లను తెచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా దేశంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కుంటుపడిందనీ, కక్షపూరిత రాజకీయాలు అధికమయ్యాయని చెప్పారు. రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. సీఎం జగన్ అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలతో ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతులు కావాలని, అభివృద్ధి నిరోధకులుగా మారిన పాలక ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని శైలజానాథ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌రతన్, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, కాంగ్రెస్, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

పేదల హక్కుల కోసం ఉద్యమం

- 1న విజయవాడలో, 4న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

కరపత్రాన్ని విడుదల చేస్తున్న జల్లి విల్సన్. పక్కన ఆవుల శేఖర్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామీణ పేదల హక్కుల కోసం ఉద్యమిద్దామని వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. విజయవాడ ఎంబీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ), అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్), అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (ఏఐఆర్‌యూఎస్), రైతు కూలీ సంఘాల సమావేశం మంగళవారం జరిగింది. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఆగస్టు 1న తలపెట్టిన దేశవ్యాప్త ఉద్యమాన్ని జయప్రదం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సమావేశానికి ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆవుల శేఖర్, వి.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 70 కోట్ల మంది పేదలు ఇంకా మూడు పూటలా తిండిలేక పస్తులతో జీవిస్తున్నారని, 50 శాతానికి పైగా నిరక్షరాస్యులు గ్రామీణ ప్రాంతంలో ఉన్నారని వివరించారు. 60 శాతం మందికి సెంటు భూమి కూడా లేదని, 35శాతం మందికి సొంత ఇళ్లు లేవని, 70 శాతం మందికి రక్షిత తాగునీరు అందక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. అతివృష్టి, అనావృష్టి వల్ల లక్షలాదిమంది ఆకలితో చనిపోతున్నారన్నారు. 80 శాతం మందికి నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చేతినిండా పనిలేక 20 కోట్లమంది వలసలు పోతున్నారని చెప్పారు. ఆవుల శేఖర్, వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ పేదల ఉద్ధరణ కోసం తీసుకొచ్చిన చట్టాలను నేటి పాలకులు నిర్వీర్యం చేశారని, ఆ చట్టాలను సంపన్నులకు అనుకూలంగా మారుస్తున్నారని విమర్శించారు. భూ సీలింగ్ చట్టాన్ని మరుగున పడేశారని, పేదల భూములకు రక్షణ కవచంగా ఉన్న 9/ 77 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. వామపక్షాల పోరాటంతో సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, ఆహార భద్రత చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టాన్ని ఎత్తివేసిందని, పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరిస్తూ పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. 1న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాకు, 4న కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలకు గ్రామీణ పేదలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు.

ఆరోగ్యంపై సమగ్రంగా చర్చించాలి

సీపీఐ నేతలకు ముసాయిదా పుస్తకం అందచేసిన బాబ్జీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆరోగ్య వ్యవస్థ గందరగోళంగా ఉందని, ఆరోగ్యంపై సమగ్రంగా చర్చించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. విజయవాడ దాసరిభవన్‌లో మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ తదితరులకు జయప్రకాష్ నారాయణ్ ప్రజలందరికీ అత్యంత తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలని కోరుతూ రాసిన ముసాయిదా వివరాలను బాబ్జీ అందజేశారు. జయప్రకాష్ రాసిన 'అందరికీ ఆరోగ్యం' పుస్తకంపై రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో చర్చ జరగాలని కోరారు. ఆరోగ్యశ్రీతో అటు ప్రజలు, ఆసుపత్రుల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యం అందక మెజారిటీ శాతం ప్రజలు అప్పులపాలై రోడ్డున పడుతున్న సంఘటనలు చాలా ఉన్నాయని వివరించారు. ప్రాథమిక ఆరోగ్యంతో పాటు సమగ్ర ఆరోగ్య వ్యవస్థ మార్పుకోసం మార్గదర్శక సూత్రాలు తయారు చేశారని, అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం ఆయన రాసిన ఆచరణ సాధ్యమయ్యేలా నమూనా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరారు. ఇది అమలు జరిగితే ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం ఉండబోదన్నారు. దీనిపై తప్పనిసరిగా పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తమకు తెలిపారని బాబ్జీ చెప్పారు. సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 'అవతలివైపుకే' కవితల సంపుటి ఆవిష్కరణ

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఈ నెల 27న స్థానిక పౌర గ్రంథాలయ సమావేశపు మందిరంలో ఉప్పల అప్పలరాజు రచించిన కవితల సంపుటి "అవతలివైపుకే" ఆవిష్కరణ సభ జరుగుతుందని ఏపీ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కార్యవర్గ సభ్యుడు పీ శ్యామసుందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ పూర్వసభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం అధ్యక్షతన సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని శ్యామసుందర్ పేర్కొన్నారు. ఆచార్య చందు సుబ్బారావు ప్రారంభోపన్యాసం చేస్తారని చెప్పారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, ఫీచర్స్ ఇండియా దినపత్రిక సంపాదకులు భరణికాన రామారావు అతిథులుగా విచ్చేస్తారన్నారు. డాక్టర్ కేజీ వేణు కావ్య సమీక్ష చేస్తారని అన్నారు. కవులు, కళాకారులు, రచయితలు, సాహిత్యాభిలాషులందర్నీ సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైవిధ్యభరితంగా ఆక్వా కల్చర్

- ఎగుమతుల్లో ఏపీ నం.1
- ఎంపెడా సదస్సులో చైర్మన్ డా.రాఘవన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రపంచంలో చేపల ఉత్పత్తిలో భారతదేశం రెండవ స్థానంలో నిలిచిందని, గత 7 దశాబ్దాలలో 18 రెట్లు పెరుగుదల సాధించామని మెరైన్ ప్రోడక్ట్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ కె. ఎస్. రాఘవన్ వెల్లడించారు. ఎంపెడా స్వర్ణోత్సవాల సందర్భంగా విజయవాడ తాజ్ గేట్ వే హోటల్‌లో మంగళవారం 'భారత దేశంలో విభిన్న జాతుల ఆక్వా కల్చర్‌కు ప్రోత్సాహం- ఎంపెడా ప్రత్యేక దృష్టితో ఏపీలో ప్రత్యామ్నాయ జాతుల పెంపకం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌ను డాక్టర్ రాఘవన్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... భారత దేశంలో మత్స్య సంపద ముఖ్యమైన ఆర్థిక కార్యకలాపమని, విభిన్న వనరులు, సామర్థ్యంతో ఈ రంగం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. వ్యవసాయంతో పాటు మత్స్య సంపదను ముఖ్య రంగంగా గుర్తించి అభివృద్ధికి బాటలు వేశామన్నారు. భారతదేశంలో 1950-51లో 0.75 మిలియన్ టన్నులు ఉన్న మత్స్య సంపద 2018-19 నాటికి 13.76 మిలియన్ టన్నులకు చేరుకోవడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రపంచంలో చేపల ఉత్పత్తిలో చైనా తర్వాత భారతదేశం ముందంజలో ఉందన్నారు. ఈరంగం ద్వారా దేశీయ అవసరాలు తీరడమే కాకుండా 15 మిలియన్ల ప్రజలకు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఆక్వా కల్చర్ మొత్తం ఎగుమతుల్లో 35 శాతంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని రాఘవన్ తెలిపారు. రాష్ట్రంలో 974 కిలో మీటర్ల తీర ప్రాంతం ఉండగా, 1.2 లక్షల హెక్టార్లలో ఆక్వా ఉత్పత్తి జరుగుతోందని, 1.74 లక్షల హెక్టార్ల ఉప్పునీటి ప్రాంతాలలో, 2.34 లక్షల హెక్టార్ల మేర రిజర్వాయర్లు, సరస్సులలో, 28 వేల 200 హెక్టార్ల మాంగ్రో, చిత్తడి నేలలలో ఆక్వా ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. శాస్త్రీయ ఆక్వా కల్చర్ పద్ధతులను, సామర్థ్యానికి సంబంధించిన శిక్షణ, ఆక్వా కల్చర్ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి ఎంపెడా పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. విశాఖలో మొదటి రొయ్యల హేచరీని ఎంపెడా ఏర్పాటు చేయడం ద్వారా దేశంలో రొయ్యల పెంపకం విప్లవానికి పునాది రాయి వేశామన్నారు. ఈ హేచరీని ప్రభుత్వం ఇచ్చిన భూమిలో స్థాపించామని, దీని తర్వాత దేశంలో 300లకు పైగా హేచరీల అభివృద్ధికి మార్గం సుగమమైందన్నారు. బ్లాక్ టైగర్ రొయ్యల పెంపకం, పునరుద్ధరణ, ఎల్ వనామా విస్తరణ, మడ పీత, సీబాస్, గిఫ్ట్, కోబియా మొదలగు జాతుల పరిచయం ద్వారా ఆక్వా కల్చర్ ను వైవిధ్యభరితంగా మార్చే కార్యక్రమాలను ఎంపెడా చేపట్టిందని రాఘవన్ వెల్లడించారు. ఈ సెమినార్‌లో జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు, హైదరాబాద్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ సువర్ణ చంద్రప్పగరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు, ఎంపెడా డైరెక్టర్ ఎమ్. కార్తికేయన్, సెక్రటరీ కె.ఎస్. ప్రదీప్, నెట్ ఫిష్ సీఈవో డా.జాయిస్ వి.థామస్, నాక్సా సీఈఓ డా.దీరిత్ ఇక్క, వివిధ ప్రాంతాలకు చెందిన ఆక్వా రైతులు, తెలంగాణ రాష్ట్ర మత్స్య రైతు సంఘం రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఎయిమ్స్ బృందం

శాస్త్రీయ పరిశోధనలపై పరస్పర అవగాహన



విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం మంగళగిరి ఎయిమ్స్ అధికారుల బృందం పర్యటించింది. ఎస్ఆర్ఎం చేపట్టే రీసెర్చ్ ప్రాజెక్టులు, అవుట్ రీచ్ ప్రోగ్రామ్స్, పేటెంట్ ఇన్వెన్షన్స్ వంటి అంశాల్లో ఎయిమ్స్ సహకారం అవసరమని వర్సిటీ ఆచార్యులు కోరినందువల్ల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిమ్స్ బృందం విచ్చేసింది. ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బృందం వివిధ విభాగాలను పరిశీలించింది. యూనివర్సిటీ డీన్ డాక్టర్ బీవీ బాబు అధ్యక్షతన వర్సిటీ ఆచార్యులు, ఎయిమ్స్ బృంద సభ్యులు సమావేశమై ఎంవోయూకు అవసరమైన నిర్ణయాలు తీసుకున్నారు. డీఎస్, డీబీటీ ప్రాజెక్టులపై రీసెర్చ్ చేస్తున్న ప్రొఫెసర్లతో ఎయిమ్స్ ప్రతినిధులు ప్రత్యేకంగా చర్చలు జరిపారు. అనంతరం లేబొరేటరీలు, క్లాస్ రూమ్స్, ఇతర విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మంగళగిరి ఎయిమ్స్ అధికారుల బృందంలో రీసెర్చ్ డీన్ డాక్టర్ దీప్తి, అసిస్టెంట్ డీన్ (ఎగ్జామ్స్) డాక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, రీసెర్చ్ అసోసియేట్ డీన్ డాక్టర్ సుశీల్‌కుమార్ శర్మ, డాక్టర్ వంశీకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు. ఎస్ఆర్ఎం అసోసియేట్ డీన్ డాక్టర్ రఘునాథన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీరాజ్యం, ప్రొఫెసర్లు డాక్టర్ సునీత, డాక్టర్ ప్రకాశ్ జాదవ్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనం వికటించి 39 మంది విద్యార్థులకు అస్వస్థత

మెనూలో కుళ్లిన కోడిగుడ్లు

విశాలాంధ్ర- పత్తికొండ: కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చక్రాల గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం వికటించి 39 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురయ్యారు. మెనూ లో భాగంగా అన్నం, పప్పుచారు, కోడిగుడ్డు ఇచ్చారు. అయితే కుళ్లిపోయిన కోడిగుడ్లు అందజేసినట్టు విద్యార్థులు గమనించకపోవడంతో భోజనంచేస్తూ ఉన్నట్టుండి అకస్మాత్తుగా కింద పడిపోయారు. తక్షణమే ఉపాధ్యాయులు అస్వస్థకు గురైన విద్యార్థులను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, డీఈవో రంగారెడ్డి ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

భోజనం వికటించి అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించేందుకు వచ్చిన డీఈఓ రంగారెడ్డిని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకొని డీఈఓ గో బ్యాక్ అంటూ, సంఘటనకు కారకులైన ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ పై చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను పరామర్శించిన వారిలో ఎంపీపీ నారాయణదాసు, సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, నజీర్, మోహన్, ఏఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ

మాట్లాడుతున్న వనజ. వేదికపై సత్యప్రకాశ్, ధర్మారెడ్డి, నాగేంద్రరావు, చలసాని వెంకట రామారావు, దేగా ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, కొమ్మన నాగేశ్వరరావు తదితరులు

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్ఎస్ఎస్ అజెండాను దేశ ప్రజలపై రుద్దుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. సీపీఐ ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ 24వ మహాసభలు మండలంలోని దిగవల్లి గ్రామంలో అమరజీవి కొల్లి నాగేశ్వరరావు ప్రాంగణంలో ఇందుపల్లి సత్య ప్రకాశ్, గుంటక ధర్మారెడ్డి, మడుపల్లి నాగేంద్రరావు అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా హిందూ భావజాలంతో నడుస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని మోదీ కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతున్నారన్నారు. శ్రామిక వర్గం సృష్టించిన సంపదను బడా బాబులకు దోచిపెడుతుందన్నారని విమర్శించారు. ఎన్నికల సంఘాలని, న్యాయ సంస్థలను మోదీ ప్రభుత్వం ప్రభావితం చేస్తూ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పోలీస్, ఈ డి, ఆదాయ పన్నుల శాఖల అధికారులను ప్రతిపక్ష నాయకులపై దాడులు నిర్వహింప చేస్తున్నారన్నారు. లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ, మత విద్వేషాలను, మతతత్వ శక్తులను రెచ్చగొడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం, మోదీ అడుగుజాడల్లో నడుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సీపీఐతో పాటు అన్ని ప్రజా సంఘాలు కలిసి రావాలని కోరారు. కార్మిక, ప్రజా వ్యతిరేక, నియంత విధానాలు నివారించాల్సిన రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష నాయకులు చోద్యం చూస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎర్ర జెండా ఆధ్వర్యంలో పోరాట నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి దేగా ప్రభాకర్ మాట్లాడుతూ నూజివీడు ప్రాంతం భూ పోరాటాలకు పేరుగాంచిందన్నారు. త్వరలో జరగనున్న సీపీఐ జిల్లా, రాష్ట్ర మహాసభల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హక్కులను హరిస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ నూజివీడు ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలకు సీపీఐ అమ్మ వంటిదన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో ఎన్నో పోరాటాల నిర్వహించి పేదలకు భూములు అందించిన పార్టీ సీపీఐ అన్నారు. అనంతరం రైతు సంఘం నాయకులు రాయకుల లక్ష్మణరావు పార్టీచేపట్టనున్న కార్యక్రమాలు పై తీర్మానం ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. నియోజకవర్గ కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వరరావు తో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూజివీడు నియోజకవర్గం పరిధిలోని సీనియర్ సభ్యులను మహాసభ ఘనంగా సన్మానించింది.

ఉద్యోగులకు 11వ పీఆర్సీ వేతనాలివ్వాలి

ఆర్టీసీ-పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాగా 11వ పీఆర్సీ వేతనాలివ్వాలని ఏపీ ఆర్టీసీ-పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీ రావు, పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. విజయవాడ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ, ప్రాంతీయ, అధ్యక్ష, కార్యదర్శులతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 11వ వేతన సవరణ జీతాలు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా, ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే అమలయ్యే విధంగా సీఎం జగన్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు జనవరి నుంచి అమలు చేస్తూ, ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం ఇవ్వకపోడం బాధాకరమన్నారు. నూతన వేతనాల అమలు కోసం ఉద్యమబాట పట్టకముందే మిశ్రా నివేదిక ప్రకారం వేతనాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు అందజేయాలనీ, బకాయిలు ఒకే సారి చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. 2017 వేతనాల సవరణ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈయూ వైస్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యంరాజు, ఉప ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, రాష్ట్రకమిటీ సభ్యులు, నాలుగు ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ దుర్మార్గం

విశాలాంధ్ర -కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ పోరాట కమిటీ అధ్వర్యంలో నిరవధిక రిలే నిరాహార దీక్షలు కొనసాగుతు న్నాయి. మంగళవారం జరిగిన దీక్షలో ఇ.ఎస్. ఎఫ్, ఇ.ఆర్.ఎస్, ఆర్.ఎస్.ఆర్ ఎస్, సేఫ్టీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ అలయన్స్ (పీడీఎఫ్)కు చెందిన ఎమ్మెల్సీలు బాలసుబ్రమణ్యం, కే లక్ష్మణరావు, వెంకటేశ్వర రావు, వై.శ్రీనివాస్‌రెడ్డి షేక్ సాదీ దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఫ్లోర్ లీడర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... అనేకమంది త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిన విశాఖ ఉక్కును అమ్మాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమైనదని దుయ్యబట్టారు, నేటి పాలకులు ప్రజల ఆకాంక్షలకు విలువ ఇవ్వటం లేదని సొంత ప్రయోజనాలే పరమావధిగా ముందుకు వెళుతున్నారని, ఇది ఎంతోకాలం సాగదని హెచ్చరించారు. పాలకుల వైఖరి ఇదే రకంగా ఉంటే భవిష్యత్తు అంధకారంగా మారుతుం దన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో తామందరమూ ప్రత్యక్షంగా పాల్గొంటామని, పోరాటాల ద్వారానే విజయం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోరాట కమిటీ సభ్యులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివారావు, ఎస్.రామారావు, మూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ప్రతినిధులు ఎం.గోవిందరావు, రాజు, ఏవీ రావు, టి.సత్యనారాయణ, ఎం.ఎన్. రెడ్డి, బంటు రాము, ప్రభాకర్‌రెడ్డి, జి.సూరిబాబు, నీలకంఠం గంగాధర్, వెంకటేశ్వర్లు గంజి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

విశాలాంధ్ర-తిరుపతి: అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జులై 27,28,29వ తేదీలలో ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ ప్యాక్ ఆడిటోరియంలో నిర్వహిస్తు న్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి తిరుపతి జిల్లా సమావేశంలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 3,4,5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేసి ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఇండెంట్ ప్రకారం పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందన్నారు. 24 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా, కేవలం టెట్ పరీక్షలు నిర్వహించి నిరుద్యోగులను నట్టేట ముంచేస్తోందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు తెరిచి నెలరోజులు గడుస్తున్నప్పటికీ పుస్తకాలు ప్రింట్ చేయకుండా డిపాజిట్ల ను కూడా రాష్ట్ర ప్రభుత్వం విత్ డ్రా చేసుకోవడం సిగ్గుచేటన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతి గృహాలలో పెరిగిన నిత్యావసర ధరలు కనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. వర్క్‌షాప్‌కు 26 జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు నెలకొన్న విద్యారంగ సమస్యలపై వర్క్‌షాప్‌లో ప్రతినిధులు, విద్యారంగ ప్రముఖులతో చర్చించి, విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. సమావేశంలో తిరుపతి జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్, చలపతి, సహాయ కార్యదర్శులు చిన్న, సుందర్, ప్రవీణ్ నాయకులు వినయ్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల వర్కర్ల వేతనాలు విడుదల చేయాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్ల వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు లలితమ్మ, మునెప్ప, రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ అధికారులకు ఆదర్శ పాఠశాలల వర్కర్ల సమస్యలపై మంగళవారం యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ, విశాఖ, విజయనగరం, కడప, కృష్ణా జిల్లాల్లో ఏడాదిపాటు వర్కర్లకు వేతనాలు నిలిచిపోయాయనీ తక్షణమే వాటిని విడుదల చేయాలన్నారు. ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఖాళీలు భర్తీ చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా జగనన్న గోరుముద్ద పథకం మెస్ చార్జీలు పెంచాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ పాండే

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జగనన్న ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ రాహుల్ పాండే హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం జగనన్న ఇళ్ల పథకంపై సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ ఎమినిటీ సెక్రటరీలకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ, లబ్దిదారుల వివరాలను సీఎఫ్ఎంఎస్ కోడ్ జనరేట్ చేసి వార్డ్ ఎమినిటీ సెక్రటరీ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. లే అవుట్లలో అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. 2023 జూన్ నాటికి పేదలందరికీ ఇళ్లు అందించాలనేది ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విజన్ అని, ప్రణాళిక ప్రకారం విధులు నిర్వహించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ ఎంతవరకు వచ్చిందనే విషయంపై పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రెండు వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయనీ, వాటికి విద్యుత్ సరఫరా అందించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. ఇసుక, ఇనుము, సిమెంట్ లబ్ధిదారులకు వెంటనే అందించేలా ఇంజనీరింగ్ అధికారులు తహసీల్దారులు, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ పీడీ సాయినాథ్ కుమార్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్.ఈ బ్రహ్మయ్య, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్.ఈ సురేశ్, హౌసింగ్ శాఖ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆక్రమిత కశ్మీర్‌పై ప్రగల్భాలు

భయమేసినప్పుడల్లా చాలామంది భగవంతుడిని తలుచుకుంటారు. గట్టిగా ఉరిమితే "అర్జున, ఫల్గుణ..." అని అంటూ ఉంటారు. మోదీ ప్రభుత్వం కూడా అలాగే అవసరమైనప్పుడల్లా పాకిస్తాన్ బూచి చూపిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడూ ఒంటికాలు మీద లేస్తుంది. తీరా చూస్తే ఇవన్నీ ప్రగల్భాల కింద మిగిలిపోతాయి. కార్గిల్ యుద్ధంలో మనం విజయం సాధించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం కార్గిల్ దినోత్సవం జరుగుతోంది. ఆ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి పాకిస్తాన్ మీద విరుచుకు పడ్డారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటామని హుంకరించారు. ఇలాంటి ఒట్టి మాటలు చెప్పడంలో రాజ్‌నాథ్ సింగ్ ఒంటరి వాడేమీ కాదు. ప్రధానమంత్రి మోదీ తరచుగానే ఈ మాట చెప్తూనే ఉంటారు. మోదీ అయితే ఏకంగా బలూచిస్థాన్‌కు స్వాతంత్ర్యం ఇప్పిస్తానని ఒకానొక స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చెప్పారు. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పాకిస్తాన్ మీద దాడి చేస్తాం అనే దాకా వెళ్లారు. ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకు తీరతామన్నారు. అయినా ఆక్రమిత కశ్మీర్ పాకిస్తాన్ అధీనంలోనే ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోనే చైనా-పాకిస్తాన్ ఆర్థిక వసారాను చైనా నిర్మించేసింది. మోదీ సర్కారులోని మంత్రులకు అప్పుడప్పుడు ఆక్రమిత కశ్మీర్ గుర్తొస్తూ ఉంటుంది. సాధారణంగా ప్రధానో, రక్షణ మంత్రో అధీన రేఖ దగ్గర ఉన్నప్పుడు పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమనీ, దాన్ని స్వాధీనం చేసుకుంటామనీ గర్జిస్తుంటారు. ఈ అధీన రేఖే పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు భారత్ అధీనంలో ఉన్న కశ్మీర్‌కు విభజన రేఖ లాంటిది. భారత నాయకులకు గుర్తొచ్చినప్పుడో, అవసరం వచ్చినప్పుడో ఇలాంటి ప్రకటనలు గుప్పిస్తూ ఉంటే బలూచిస్థాన్ ప్రజలు ఎప్పుడు స్వతంత్రం అవుతామా అన్న ఆశలు పెంచుకుంటారేమోనన్న అభిప్రాయం కలుగుతుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పాకిస్తానీయులు "ఆజాద్ కశ్మీర్" అంటారు. కానీ అక్కడ ఉండే కశ్మీరీలను మాత్రం ఎందుకనో స్వతంత్ర కశ్మీర్‌లో ఉండే వారిగా భావించరు. నిజానికి తమ అధీనంలో ఉన్న ఆక్రమిత కశ్మీర్‌ను పాకిస్తాన్ "స్వతంత్ర దేశం" గానే భావిస్తుంది. అయితే దాని సంరక్షకులం తామే అన్నట్టుగా పాకిస్తాన్ ప్రవర్తిస్తుంది. అధీన రేఖకు భారత్ వేపున ఉండే వారిని పాకిస్తాన్ తోడేళ్లలా చిత్రీకరిస్తుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనని మన నాయకులు అప్పుడప్పుడూ చెప్పడం వింటూనే ఉన్నాం. మరి మన శత్రుదేశం అనుకుంటున్న పాకిస్తాన్ చేతిలో ఎందుకుందో మాత్రం ఎవరూ సమాధానం చెప్పరు. గుర్తొచ్చినప్పుడల్లా హుంకరించినంత మాత్రాన ఆక్రమిత కశ్మీర్ అమాంతం భారత్‌లో అంతర్భాగం అయిపోయే మార్గమైతే కనిపించడం లేదు. ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంటామని బీరాలు పలికే నాయకులకు కొదవ లేదు కానీ స్వాధీనం చేసుకోవడానికి ఏం చేస్తారో, ఏం చేయాలనుకుంటున్నారో ఎవరూ చెప్పరు. ఆక్రమిత కశ్మీర్ మన అధీనంలోకి ఎప్పుడొస్తుంది అని అడిగినా ఎవరి దగ్గరా సమాధానం ఉండదు. సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికలు జరగవలసి ఉన్నప్పుడో లేదా సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి అనుకున్నప్పుడో బీజేపీ నాయకులు ఆక్రమిత కశ్మీర్ ప్రస్తావన తీసుకొస్తుంటారు. ఆ సమయంలో బీజేపీ నాయకుల్లో జాతీయత కట్టలు తెంచుకుని పొంగి పొరలుతూ ఉంటుంది. ఎన్నికల సమయంలో కశ్మీర్, ఆక్రమిత కశ్మీర్, పాకిస్తాన్ అన్న మాటలు దొర్లించకుండా బీజేపీ నాయకులు ప్రసంగించే సందర్భాలే ఉండవు. మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి చైనా ప్రస్తావన కూడా తీసుకొస్తున్నారు. చైనా దూకుడును సహించబోం అని గంభీరమైన ప్రకటనలు జారీ చేస్తూ ఉంటారు. కానీ సరిహద్దులో చైనా పాల్పడుతున్న ఆగడాలను ఎదుర్కోవడం అటుంచి కనీసం ప్రస్తావించే సాహసం కూడా బీజేపీ నాయకులు చేయలేరు. ఇవన్నీ అసలు సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించడానికి బీజేపీ నాయకులు అప్పనంగా ఉపయోగించుకుంటూ ఉంటారు. దానివల్ల బీజేపీకి ఎన్నికల్లో ఫలితమూ దక్కుతుంది. సరిహద్దులో అంటే భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చి చైనా ఒక గ్రామాన్నే నిర్మించిందంటున్నారు. దీనికి మాత్రం దేశభక్తి పేరెత్తితే శివాలయ్యులు అయిపోయే బీజేపీ నాయకుల నోరే పెకలదు.

ఇంకా విచిత్రం ఏమిటంటే ఆక్రమిత కశ్మీర్ గురించి మాట్లాడడానికి మోదీ సర్కారులో కాబినెట్ మంత్రులే కానక్కర్లేదు. సహాయ మంత్రులు కూడా గొంతు చించుకోగలరు. పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ పాటిల్ మహారాష్ట్రలోని థానేలో మాట్లాడుతూ పూనకం వచ్చినట్టు ప్రవర్తించారు. "మోదీ ప్రధానమంత్రి అయింది ఉల్లిపాయలు, బంగాళా దుంపల ధరలు తగ్గించడానికి కాదు. 2024కల్లా ఏదో జరుగుతుంది చూడండి. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అయిపోతుంది. ఈ మాట అనుకోవడానికి ఇబ్బందేమీ ఉండదు. ప్రధానమంత్రి మోదీ మాత్రమే ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేయగలరు" అని పాటిల్ సెలవిచ్చారు. జనంలో భావోద్రేకాలు రెచ్చగొట్టడానికైతే ఇలాంటి మాటలు రంజుగా ఉంటాయి. మాటలకు చేతలకు అపారమైన అంతరం ఉంటుందని ఆచరణలో రుజువు అవుతూ ఉంటుంది. అయినా బీజేపీ నాయకులు మళ్లీ ఆక్రమిత కశ్మీర్ ప్రస్తావన తీసుకొస్తూనే ఉంటారు. మంత్రివర్గ సమావేశాల్లో ఇలాంటి మాటల ప్రస్తావన వచ్చినందువల్లే పాటిల్ లాంటి వారు ఇంతగా సాహసించి మాట్లాడగలరు. మోదీ, అమిత్ షా మనసులో ఎప్పుడూ ఎన్నికలే ఉంటాయి. ఎన్నికల్లో గెలవడానికి వ్యూహ రచన చేయడం, ఎత్తులు పై ఎత్తులు వేయడంలోనే ఎప్పుడూ ఈ ఇద్దరు అగ్ర నాయకులు తలమునకలై ఉంటారు. అలాంటి సమయంలో దారి తెన్నూ కనిపించకపోతే ఆక్రమిత కశ్మీర్ ప్రస్తావన తీసుకొస్తారు. కార్గిల్ దివస్ ఓ సందర్భం కనక రాజ్‌నాథ్ సింగ్ జూలు విదిలించారు. ఇలాంటి మాటలవల్ల భావోద్వేగాలు రెచ్చగొట్టడం సులభం అని వారికి తెలుసు. జమ్మూ ప్రాంతానికి చెందిన డా. జితేందర్ సింగ్ అనే మంత్రి అయితే సంవత్సరానికి ఒక్కసారి ఆక్రమిత కశ్మీర్ గురించి మాట్లాడతారు. ఆ తరవాత సందడే కనిపించదు. మరుసటి సంవత్సరం ఆయనకు ఆక్రమిత కశ్మీర్ హఠాత్తుగా గుర్తొస్తుంది. విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా "ఆక్రమిత కశ్మీర్ మనదే. ఏదో ఒక రోజు మన గుప్పెట్లోకి రాక మానదు" అంటూ ఉంటారు. ఎప్పుడొస్తుంది అన్న ప్రశ్నకు మాత్రం ఛోటా మోటా బీజేపీ నాయకుల దగ్గర్నించి రక్షణ మంత్రి, హోం మంత్రి, ప్రధానమంత్రి దాకా ఎవరి దగ్గరా సమాధానమే ఉండదు. ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అయితే హర్షించని భారతీయులు ఎవరూ ఉండకపోవచ్చు. కానీ విజ్ఞత ఉన్న వారు ఎవరైనా సాధ్యాసాధ్యాల గురించి ఆలోచించి తీరుతారు. ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవడానికి పాకిస్తాన్ మీద దండయాత్ర చేసే అవకాశం ఏమైనా ఉందా? ప్రస్తుత పరిస్థితిలో దాడి అసాధ్యం అని వివేచనా శక్తి ఉన్న వారికెవరికైనా తెలుస్తుంది.

రైతులందరికీ పథకాలు అందించండి

బి.బి.రామకృష్ణారావు

ఉచిత పంటల బీమా పథకం, ఇతర పథకాల ప్రయోజనాలు అందుకు నేందుకు రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాప్, ఇకెవైసి నమోదు చేయించు కోవాలనే విషయం రైతులందరికీ తెలియనందున ఈ లబ్ధిని పొందలేక పోయారు. ముఖ్యంగా ఉచిత పంటల బీమా పథకం చాలా మంది రైతుల దరి చేరలేదు. గత ఏడాది కరోనా ఉధృతంగా ఉన్నందున రైతులు భరోసా కేంద్రా లకు వెళ్ళి నమోదు చేయించుకోలేకపోయారు. దీంతో పంట నష్టపోయిన రైతులందరికీ లబ్ధి చేకూరలేదు. ఈ విధంగా లబ్ధి పొందనివారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 శాతం రైతులు ఉంటారని రైతు సంఘాలు అంచనా వేస్తున్నాయి. ఏ సాయమూ లేక సన్నకారు,



చిన్నకారు, కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. కనీసం బీమా పథకం కూడా అంద నందున కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో ఒక కౌలు రైతు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. గతంలో అయితే పంట పొలంలో ఉండి నష్టపోతే బీమా లేదు. అదే పంట మిల్లులోకి వచ్చి మిల్లరు నష్టపోతే బీమా వస్తుందని రైతు సంఘ నాయకులు అనేవారు. అయితే గ్రామ, వార్డు సచివాలయాలు మాదిరిగా రైతు సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందించతగ్గ విషయం. కానీ వీటిని సక్రమంగా నిర్వహించాలి. పథకాల ప్రయోజనాలు అందరికీ అందిం చాలి. ఈ క్రాప్ చేయాలంటే రైతును పొలంలో నిలబెట్టి ఫొటో తీయాలి. తర్వాత ఆధార కార్డు ద్వారా ఇకెవైసి చేయాలి. ఈ పనులన్నీ చేయాలంటే రైతు భరోసా కేంద్రాలలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోరు. సచివాలయం మాదిరిగానే సిబ్బందిని, వలంటీర్లను నియమించాలి. రాష్ట్ర వ్యాప్తంగా 10,871 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో తగినంత సిబ్బంది లేరు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి, ఎరువులు, విత్తనాలు లాంటివి అమ్మడానికి, ధాన్యం కొనుగోలు లాంటి కార్యక్రమాలు చేయడానికి ఇప్పుడున్న సిబ్బందికి తలకు మించిన భారమవుతోంది. రైతు భరోసా కేంద్రాలపై రైతులలో విస్తృతంగా ప్రచారం కావాలి.

పత్రికలు, టీవీల ద్వారా ప్రచారం చేస్తే తెలుసుకునే రైతులు చాలా తక్కువ. కరపత్రాలు, మైకు, మీటింగ్‌లు ద్వారా ప్రజాప్రతినిధుల, రైతు సంఘాల సహకారంతో మారు మూల ప్రాంత రైతులకు తెలియాలి. గత ఏడాది ఖరీఫ్‌లో ఈ క్రాప్ సమాచారం రైతులందరికీ చేరనందున కొంతమంది రైతులు నమోదు చేసుకోలేక పోయారు. అంతేగాక ఈక్రాప్ నమోదు చేయించుకునే సమయంలో గత ఏడాది కరోనా ఉధృతంగా ఉండటంతో మరికొంతమంది రైతులు చేయించు కోలేదు. ఈక్రాప్ పద్ధతి గత ఏడాది ఖరీఫ్ నుంచే తొలిసారిగా ప్రవేశపెట్టడం వల్ల కొంతమంది రైతులకు అర్థం కాలేదు. ఇన్ని కారణాల పంటనష్ట పరిహారం గానీ, పంటల బీమా పథకంగానీ అందని రైతులు చాలామంది ఉన్నారు. కరోనా సమయంలో 75 శాతం హాజరు లేకపోయినా అమ్మ ఒడి పథకం అమలు చేసినట్లు ఈక్రాప్ నిబంధనను సడలించి పంట నష్టపోయిన రైతులందరినీ మానవతా దృక్పథంతో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎక్కువగా చిన్న, సన్నకారు, కౌలు రైతులకే అందలేదని రైతు సంఘాలు అంటు న్నాయి. కనీసం వారికి ఇచ్చినా రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఆగి పోయే అవకాశం ఉంది. ఈ క్రాప్ నిబంధన పేరుతో నిజంగా నష్టపోయిన చిన్న రైతుకు నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకర విషయం.

వ్యాస రచయిత సెల్ 9441069495

వెనెజులాతో కాళ్ల బేరంలో అమెరికా

సత్య

అందితే జుట్టు లేకపోతే కాళ్లు అన్న సామెత తెలిసిందే. లాటిన్ అమెరికాలోని వెనెజులా గత ఏడు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. అక్కడ వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉంది గనుక తలెత్తిన స్థితిని ఆసరా చేసుకొని ఎన్ని కట్టుకథలు, ఎన్ని దెప్పిపొడుపులో ! ఇప్పుడు ఆ దేశంలో పరిస్థితి ఏమిటి? 2022 జులై పన్నెండవ తేదీన బిబిసి ముండో (స్పానిష్ భాష) అమెరికా విదేశాంగశాఖ మాజీ ముఖ్య కార్యదర్శి కారీ ఫిలిపెట్టీతో ఇంటర్వ్యూ ప్రచురించింది. ట్రంప్ ఏలుబడిలో విదేశాంగ శాఖలో వెనెజులా, క్యూబా వ్యవహారాలను ఆమె చూశారు. అమెరికా అధి కారులు ప్రస్తుతం వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోతో సంప్రదిస్తున్నారని ప్రతిపక్షంతో ఎలాంటి సంబంధాలు లేవని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన మదురో బదులు తాము మద్దతు ఇచ్చిన ప్రతిపక్ష నేత జువాన్ గుయిడోనే విజేతగా గుర్తిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్, తరవాత ఇటీవలి వరకు జో బైడెన్ సర్కార్ ఆ వైఖరినే కొనసాగించింది. మదురోను పదవి నుంచి తొలగించాలని అక్కడి మితవాద శక్తులకు అమెరికా తోడ్పడింది. ప్రస్తుతం ప్రపంచంలో తలెత్తిన ఇంధన సంక్షోభం ప్రారంభం వరకు అమెరికా చదరంగంలో గుయిడోనే పావుగా ఉన్నాడు. ఒక ఎత్తుగడగా లేదా అవసరంకొద్దీ అధికారికంగా మదురో సర్కార్‌తో చర్చలు జరుపుతోంది.

వెనెజులా పౌరులు కొన్నేళ్ళుగా పడుతున్న కష్టాలు, ఇబ్బందులకు అమెరికా కారణం అన్న మౌలిక అంశాన్ని మీడియా కావాలనే విస్మరించి, కట్టుకథలు, పిట్టకతలు చెప్పింది, వాటిని గుడ్డిగా నమ్మి అనేకమంది రకరకాలుగా చెప్పారు. ఎవరెన్ని చెప్పినా అక్కడి జనం వామపక్ష మదురోవైపే మొగ్గు చూపుతున్నారు. మానవహక్కులు, ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలన పరిరక్షణ పేరుతో అనేక దేశాలపై అమెరికా విధించిన ఏకపక్ష ఆంక్షల ప్రతికూల పర్యవసానాలను నివేదించేందుకు ఐరాస ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దాని నివేదన అధికారిణి ప్రొఫెసర్ అలేనా దౌహాన్ ఇటీవల చెప్పిన ప్రకారం అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలు 98 శాతం అవి చెప్పిన సుభాషితాలు, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే అని పేర్కొన్నారు. జింబాబ్వే సందర్శనలో ఆమెతో కొందరు విద్యార్థులు మాట్లాడుతూ తమ దేశంపై ఆంక్షల కారణంగా టూరిస్టులుగా కొన్ని చోట్లకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చిందని, పరీక్షలకు వెళ్లి రోడ్ల మీద నిద్రించాల్సి వచ్చిందని చెప్పారు. వెనెజులాపై ఆంక్షల కారణంగా 2017, 2018లో శిశు మరణాల రేటు 31శాతం పెరిగిందని, ఆరోగ్య హక్కుకు భంగం కలిగిందని అలేనా చెప్పారు. వాక్సిన్ల కొనుగోలును అడ్డగించిన కారణంగా 26లక్షలమంది వెనెజులా పిల్లలకు మెనెంజటిస్, రోటావైరస్, మలేరియా, ఇన్‌ఫ్లూయెంజా, మీజిల్స్, ఎల్లో ఫీవర్ ముప్పు తలెత్తిందన్నారు.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా వెనెజులా కరోనా మహమ్మారిని కట్టడి చేసి చావులను గణనీయంగా అరికట్టింది. ప్రతి లక్ష మందికి 20.1 శాతం మంది మరణిస్తే అదే అమెరికాలో 304.18 శాతం చావులు నమోదయ్యాయి. వెనెజులా మీద 2017 నుంచి 600 రకాల ఆర్థిక ఆంక్షలను అమెరికా అమలు జరిపింది. ఒక దశలో వీటి కారణంగా 99 శాతం రాబడిని కోల్పోయింది. మరో వైపు మితవాద శక్తులను రాజకీయంగా ఉసిగొల్పింది. వీటన్నింటినీ మదురో సర్కార్, అధికార సోషలిస్టు పార్టీ ఎదుర్కొన్నది. 2021 డిసెంబరులో జరిగిన ప్రాంతీయ, మున్సిపల్ ఎన్నికల్లో 23 గవర్నర్ పదవులకుగాను 21, 213 మేయర్ పదవుల్లో 120 గెలుచుకుంది.

అమెరికా, ఇతర దాని మిత్ర దేశాల ఆంక్షల, ఇతర కొన్ని అంశాల కారణంగా గత పది సంవత్సరాల్లో వెనెజులా ఆర్థికంగా 70 శాతం దిగజారింది. అనేక తీవ్ర ఇబ్బందులున్నప్పటికీ ఈ ఏడాది ప్రథమార్థం నుంచి జిడిపి కోలుకోవటం ప్రారంభమైంది. కొత్తగా వ్యాపారాలు ప్రారంభం అవుతున్నాయని, జనం కొనుగోలు ఖర్చు పెరిగిందని తాజా వార్తలు. వెనెజులియన్ ఫైనాన్స్ అబ్జర్వేటరీ సంస్థ చెప్పినదాని ప్రకారం ఈ ఏడాది తొలి ఆరునెలల్లో ద్రవ్యోల్బణం 53.8శాతం, ఇది గతేడాదితో పోలిస్తే ఆరోవంతు. కరెన్సీ బొలివర్ విలువ డాలర్‌తో గతేడాది 50శాతం పతనమైతే ఈ ఏడాది 17శాతం. అనేక నియంత్రణ చర్యలు, ఇతర అంశాలు దీనికి దోహదం చేశాయి. ఈ ఏడాది ఆఖరుకు రోజుకు 20 లక్షల పీపాల చమురు ఉత్పత్తి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుండగా ప్రస్తుతం 7.75 లక్షల పీపాలు జరుగుతున్నది. కోటి మంది కార్మికులు, ఇతరులకు లబ్ధికలిగించే వేతనాలు, కనీస వేతనాలను ప్రభుత్వం ఇటీవల పెంచింది. లాటిన్ అమెరికా-కరేబియన్ ఎకనమిక్ కమిషన్ అంచనా ప్రకారం 2014 తరువాత ఈ ఏడాది వృద్ధి రేటు ఐదుశాతం ఉంటుంది, అది అన్ని లాటిన్ అమెరికా దేశాల కంటే ఎక్కువ. ఈ జనవరి నుంచి మార్చి నెల వరకు అంతకు ముందు ఏడాదితో పోలిస్తే చమురు ఉత్పత్తి రోజుకు 5,33,000 పీపాల నుంచి 7,56,000 పీపాలకు పెరిగింది. ఏడాది పొడవునా ఆరు లక్షల పీపాలు ఉంటే జిడిపి వృద్ధి రేటు 8 శాతం ఉంటుందని మరొక అంచనా. ఐదేళ్ళుగా అమలు జరుపుతున్న ఆంక్షలను అమెరికా కొద్దిగా మే 17 నుంచి సడలించింది. వెనెజులా ప్రభుత్వ రంగ చమురు కంపెనీతో లావాదేవీలు జరపవచ్చని అమెరికా, ఐరోపా చమురు కంపెనీలకు సూచించింది.

ఇరాన్‌తో చెలిమి

అమెరికా ఆంక్షలకు గురైన దేశాలలో ఇరాన్ కూడా ఒకటి. వెనెజులా ఇరాన్ మధ్య వివిధ రంగాలలో 20 సంవత్సరాల వ్యూహాత్మక సహకార ఒప్పందంపై ఇరుదేశాల నేతలు జూన్ 11 న సంతకాలు చేశారు. చమురు రంగంలో ఇరాన్, ఆహార, ఉత్పత్తి ఎగుమతిలో వెనెజులా సహకరించుకుంటాయి. ఎనిమిది లక్షల పీపాల చమురును రవాణా చేసే ఓడలను ఇరాన్ అందిస్తుంది. రెండు దేశాలూ అమెరికా సామ్రాజ్యవాద బాధితులే, వ్యతిరేకులే. ఉక్రెయిన్ - రష్యా వివాదంతో తలెత్తిన పరిస్థితి పర్యవసానాలను అంచనా గట్టటంలో అమెరికా విఫలమైందనే చెప్పాలి. అమెరికాలో అసాధారణ రీతిలో చమురు ధరల పెరుగుదల వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అధికార డెమోక్రటిక్ పార్టీని దెబ్బతీయవచ్చనే అంచనాలున్నాయి. అసాధారణ రీతిలో పెరిగిన ద్రవ్యోల్బణ దేశ జిడిపి వృద్ధి రేటును కూడా దెబ్బతీస్తుంది. వచ్చే ఏడాది మాంద్యంలోకి జారవచ్చన్న హెచ్చరికలూ ఉన్నాయి. చమురు ధరలు తగ్గాలంటే సరఫరాను పెంచాలన్న వినతులను సౌదీ ఇతర దేశాలు అంగీకరించలేదు. రష్యా చమురు ఎంత ఎక్కువగా మార్కెట్‌కు వస్తే అంత అధికంగా దానికి రాబడి వస్తుందని తేలింది. అందువలన వెనెజులాపై గతంలో విధించిన ఆంక్షలను చూసీచూడనట్లు నటిస్తూ అక్కడ చమురు ఉత్పత్తి పెంపుదలకు అమెరికా చొరవ చూపింది. తద్వారా అంతర్జాతీయ మార్కెట్లో ధరలు తగ్గితే అమెరికాకూ మేలే గనుక ఇది దాని అవసరం కోసం తప్ప వెనెజులా మీద మనసు మారి కాదు. తిరిగి ఎప్పుడైనా పంజా విసరవచ్చు. దొరికిన ఈ వెసులుబాటును వెనెజులా తనకు అనుకూలంగా మార్చుకుంటోంది. గతంలో చమురు ధరల పతనం కూడా దాని ఆర్థిక ఇబ్బందులకు ఒక కారణం ఇప్పుడు వందడాలర్లకు పైగా ఉన్నందున రష్యా మాదిరి కొన్ని దేశాలకు రాయితీ ఇచ్చినా దానికి రాబడి పెరుగుతుంది. ఆగస్టు 13 నుంచి 27వ తేదీ వరకు వెనెజులా రాజధాని కారకాస్‌లో ఇంటర్నేషనల్ ఆర్మీ గేమ్స్ జరుగుతున్నాయి. రష్యా ప్రారంభించిన ఈ క్రీడలను తొలిసారిగా పశ్చిమార్ధగోళంలోని వెనెజులా నిర్వహిస్తున్నది. ఇప్పటివరకు 37 దేశాల నుంచి 275 టీములు, 36 విభాగాల్లో పోటీ పడేందుకు వస్తున్నట్లు సమాచారం. జరుగుతున్నది క్రీడలే కావచ్చుగానీ వీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది. లాటిన్ అమెరికాలో ఇప్పటికే తొమ్మిది దేశాల్లో అమెరికా వ్యతిరేక, వామపక్ష పార్టీల ప్రభుత్వాలు ఉన్నాయి. త్వరలో పనామా కూడా వీటి సరసన చేరవచ్చని వార్తలు వస్తున్నాయి. మొత్తంగా చూసినపుడు అమెరికా బయట-తన పెరటితోట అనుకుంటున్న లాటిన్ అమెరికాలోనూ ఒంటరి అవుతున్నది.

అక్రమ రవాణాలో 20 శాతం పిల్లలే

రోజూ ప్రపంచ వ్యాప్తంగా 35 మిలియన్ల మంది సుమారు 155 దేశాల్లో అక్రమ రవాణాకు గురవుతున్నారని నివేదికలు పేర్కొంటున్నాయి. వీరిలో కేవలం 4% మాత్రమే తిరిగి యథాస్థితికి రాగలుగుతున్నారు. నెట్ ఫ్లెక్స్, మెక్ డోనాల్డ్, వాల్ట్ డిస్నీ కంపెనీలు వ్యాపారం కంటే దీటుగా ఈ అక్రమ రవాణా వ్యాపారం సుమారు 99 బిలియన్ల అమెరికన్ డాలర్లు మేర ఏటా చేస్తున్నాయి. మొత్తం అక్రమ రవాణాలో 20% పిల్లలు ఉండగా మిగిలినవారు బాలికలు, మహిళలు. వీరిలో 80% శాతం లైంగిక దోపిడీకి గురవుతున్నారు. 2020 భారత్ యన్.సి.ఆర్.బి నివేదిక ప్రకారం 4709 మంది అక్రమ రవాణాకు గురయ్యారు. వీరిలో 1714 మందిపై కేసులు నమోదు కాగా మహారాష్ట్ర, తెలంగాణ 184 చొప్పున, ఆంధ్రప్రదేశ్ 171, కర్ణాటక 166తో పాటు జార్ఖండ్ రాజస్థాన్ ఇతర రాష్ట్రాల్లో మిగిలిన కేసులు నమోదు చేశారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆయుధాలు, మాదకద్రవ్యాల చీకటి వ్యాపారం తరువాత "తక్కువశ్రమ-ఎక్కువ రాబడి"గా సాగుతున్న "మానవ అక్రమ రవాణా" వ్యాపారం ప్రస్తుతం సమాజంలో ఉన్న అతిపెద్ద సామాజిక సమస్య. 2003 నుండి ఐక్యరాజ్య సమితి ప్రోటోకాల్ ప్రకారం వ్యక్తుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా దృష్టి సారించి, 2010నుండి ప్రపంచ దేశాల సహకారంతో ఈ సమస్య రూపుమాపేందుకు "గ్లోబల్ యాక్షన్ ప్లాన్" రూపొందించి, ఏటా జులై 30వ తేదీన అంతర్జాతీయ మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటూ, ఈ ఉచ్చులో పడకుండా అవగాహన కల్పిస్తున్నారు. "ఏ వ్యక్తినైనా తన అనుమతితో (లేదా) అనుమతి లేకుండా వెట్టిచాకిరి చేయించుటకు, డబ్బులు ఆశ చూపి బలవంతంగా, మోసపూరితంగా శారీరక ప్రయోజనాలు కోసం వాడుకోవడం మానవ అక్రమ రవాణాగా పరిగణించాలి అని ఐక్యరాజ్య సమితి తెలిపింది. అనగా మోసం, బెదిరించటం ద్వారా ఒక వ్యక్తిని ఒకచోట నుండి మరో చోటుకు తరలించడం వారిని చట్ట వ్యతిరేక పనుల్లో వినియోగించటం. ప్రపంచ వ్యాప్తంగా 2018లో 148 దేశాల నుంచి 50,000 మంది పైగా అక్రమ రవాణాకు గురైనట్లు, వీరిలో 50% లైంగిక దోపిడికి గురైనట్లు, 38% మందిని బాల కార్మికులుగా మార్చారని వీరిలో 46% మంది మహిళలు కాగా, 19% బాలికలు అని యు.యన్.ఓ.డి.సి తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ముగ్గురు బాధితుల్లో ఒకరు పిల్లలే.

మనదేశంలో 2018లో 5264 కేసులు నమోదు కాగా, వీరిలో 64% స్త్రీలు 18 సంవత్సరాల వయస్సు నిండనివారు ఎక్కువగా బిహార్, మహారాష్ట్ర, తెలంగాణ, జార్ఖండ్, ఏపి, ఒడిషా తదితర రాష్ట్రాల నుంచి వీరిలో అధిక శాతం యస్.సి, యస్.టి, వెనుకబడిన వర్గాలకు చెందినవారిగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలిపింది. పేదరికం, బతుకు తెరువు కోసం, వలస వెళ్ళుట అక్కడ మధ్యవర్తులు మోసం చేయుట, యుద్ధాలు, కరువు కాటకాలు, ప్రకృతి వైపరిత్యాలు, శరణార్థులు, వలసదారులు ఈ అక్రమ రవాణా బారిన పడుతున్నారు. సగటున ప్రతి రోజూ మన దేశంలో 160మంది మహిళలు అక్రమ రవాణా బారిన పడుతున్నారు. "గ్లోబల్ స్లావరీ ఇండెక్స్" తాజా నివేదికలో సుమారు 36 లక్షల మంది ఈ మురుకు కూపంలో జీవితాలు గడుపుతున్నారు. మరికొందరు "మోడరన్ స్లేవరీ" పేరుతో ఈ జీవితం అనుభవిస్తున్నారు. - ఐ.పిఆర్

చంపేసినా చట్టాలేమీ చేయవే?

కరవది సుబ్బారావు

రక్షణ చట్టాలు, అట్రాసిటీ చట్టాలు నేటి సమాజంలో అగ్ర వర్ణాలు, పెత్తందారుల చుట్టాలుగా మారాయి. పోలీసు వ్యవస్థ పూర్తిగా దేశంలో రాజకీయ పార్టీ, పెత్తందారుల, అగ్రవర్ణాల, ధనవంతుల కనుసన్నలలో కొనసాగుతోంది. రాష్ట్రంలో అనేక చోట్ల దళితులు, బడుగు, బలహీన వర్గాలు, మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా కనీసం పోలీస్ స్టేషన్‌లలో కేసులు కూడా నమోదు కావటం లేదు. దాడి చేసిన పెత్తందారులు పోలీస్ స్టేషన్‌లలో కేవలం 5 నిమిషాల మించి ఉండటం లేదు. బాధితులు మాత్రం అదే పోలీస్ స్టేషన్‌లలో ముద్దాయిలుగా మారి జైళ్లకు పోతున్నారు. ఎంతో రక్షణగా ఉండాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వాలు నీరు గారుస్తున్నాయి. ఇప్పటివరకు ఎంతమంది దళితులు హత్యకు గురయ్యారో, దాడులకు గురయ్యారో, అత్యాచార బాధితులుగా రోదిస్తున్నారో నిగ్గు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమయ్యింది. దేశంలో కులవివక్ష లేని ప్రాంత మెక్కడుందో పాలకులే చెప్పాలి.

రెండు శతాబ్దాలు మనదేశాన్ని పాలించిన తెల్లదొరలను ఐక్యంగా తరిమికొట్టి స్వతంత్రాన్ని సాధించుకున్నాం. ఇందుకోసం ఎందరో మహానుభావులు త్యాగాలు చేశారు. ఇందులో దేశంలో మెజార్టీ వర్గమైన దళిత, బడుగు, బలహీన వర్గాల భూమిక ప్రముఖమైనది. సొంత రాజ్యాంగాన్ని తయారు చేసుకుని మనల్ని మనమే పాలించుకుంటే దేశంలో ప్రజలంతా సమాన హక్కులతో జీవనం సాగిస్తారని ఆశించాం. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందుతాయని భావించాం. కాని నేటికీ మెజార్టీ ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధిలో ఎటువంటి మార్పు రాలేదు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు గడిచినా అట్టడుగులో ఉండి కుల వివక్ష, అంటరానితనం, పేదరికం అనుభవిస్తున్న దళితుల పరిస్థితి దీనంగానే ఉంది. ఈ దుస్థితి మారకపోగా రోజురోజుకు మరింత హీనంగా తయారవుతోంది. అనేక పథకాలు, రక్షణ చట్టాలు రాజ్యాంగంలో కల్పించారు. రాజ్యాంగం రచించిన పెద్దలు ఈ దేశంలో అట్టడుగున ఉన్న ప్రజలు అగ్రవర్ణాల వారితో సమానంగా ఉంటారని, దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని అనుకున్నారు. కానీ ఈ దేశ పాలకులకు ఉన్న పెత్తందారీ కులోన్మాద భావజాలం వల్ల అట్టడుగున ఉన్న దళితులు అక్కడే ఉన్నారు. వారిని అంటరానివారుగానే, తక్కువ కులం వారుగానే చూస్తున్నారు. వారిని ఎదగకుండా అణచివేస్తూ కట్టుబానిసలుగానే పరిగణిస్తున్నారు. పాలనలో భాగస్వామ్యం కల్పించినప్పటికీ రాష్ట్రపతులు, మంత్రులు, బ్యూరోక్రాట్స్‌గా దళితులు పదవులు చేపట్టినప్పటికీ వారిపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, కులవివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పెద్దల అండతో ప్రతి 15 నిమిషాలకు ఒక దురాగతం జరుగుతోందని లెక్కలు చెప్తున్నాయి. రాష్ట్రంలో ఎంతో దారుణమైన ఘటనలు దళితులపై జరుగుతున్నాయి?. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత ఫోటోను హోటల్‌లో ఎంగిలి ప్లేట్లపై ముద్రించి అవమానించారు. ఇది ఈ దేశం మొత్తం తలవంచుకునే ఘటన. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మా దేశంలో ఎందుకు పుట్టలేదని, పుడితే తమ దేశం ఎంతో అభివృద్ధి సాధించేదని అనేక దేశాల వారు మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాలలో విగ్రహాలు, ముఖద్వారాలు నిర్మించిన పరిస్థితిని మనం గమనిస్తూనే ఉన్నాం. మన రాష్ట్రంలో దళిత యువకుడిని ఎమ్మెల్సీ కొట్టి చంపి, యువకుడి ఇంటికే శవాన్ని తీసుకువచ్చిన ఘోరాన్ని చూస్తే మనం ఏకాలంలో ఉన్నామో, ఈ రాష్ట్రంలో దళితుల పరిస్థితి ఏంటో అర్థమవుతోంది. ఈ ఘటనకు కారణమైన ఎమ్మెల్సీని రక్షించటానికి ప్రభుత్వ పెద్దలు, పోలీసులు, ఎన్ని డ్రామాలు చేస్తున్నారో చూస్తున్నాం. ఈ సమాజంలో దళితుడిని ఎంత హీనంగా చూస్తున్నారో అవగతం చేసుకునేందుకు ఇదే తార్కాణం. బహిరంగంగా చంపినా తమను అడిగేవారు ఎవరని పెత్తందారులలో, అగ్రవర్ణాల వారిలో ఎంత దీమా ఉందో ఈ ఘటన తెలియజేస్తోంది. దళితుల జీవితాలు పశువుల కన్నా హీనంగా ఉన్నాయి. ఉన్నత చదువులకెళుతున్న దళిత యువకులు ప్రేమించి ఒకరిని ఒకరు అర్థం చేసుకుని వివాహాలు చేసుకున్నా హర్షించలేకపోతున్నాం, వారిని అక్కున చేర్చుకోలేని బుద్ధిలేని సమాజంలో మనం ఉన్నాం. కులాంతర వివాహాలు చేసుకున్న వారిని వెంటాడి, వేధించి చంపి రాక్షసానందాన్ని పొందుతున్న సమాజంలో జీవిస్తున్నాం. సిపిఎస్‌పురంలో దళితుడిని హత్య చేసినా, మూలగుంటపాడులో దళిత కుటుంబాలపై దాడులు చేసినా పోలీసులు కనీసం బాధితుల వంక చూడకపోగా, ముద్దాయిలకే రక్షణ కల్పిస్తున్నారు. పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయటంగాని, అట్రాసిటీ కేసులు పెట్టటం కాని చేయటం లేదు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వచ్చి బాధితులకు రక్షణ కల్పిస్తామని భరోసా ఇవ్వటం లేదు. దీంతో బాధిత కుటుంబాలు మరింత భయంతో వణికిపోతున్నాయి. మన జీవితాలు ఇంతేలే అనే మనువాద సిద్ధాంతానికి లోబడిపోతున్నారు. పాలకులు మాత్రం ఇది ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్యక దేశమని, ఇక్కడ అందరూ సమానమేనని, వీరి అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, వీరికి అనేక రాయితీలు కల్పిస్తున్నామని, వారికి ఇన్ని వేల కోట్లు ఇప్పటి వరకు ఖర్చు చేశామని, రానున్న కాలంలో మరిన్ని కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆ వైపుగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని చెప్పే ప్రసంగాలు కేవలం వేదికలకే పరిమితమవుతున్నాయి. ఒక వైద్యుడు కేవలం దళితుడైనందున ప్రభుత్వాన్ని ప్రశ్నించాడనే నెపంతో అతనిని పిచ్చివాడిగా ముద్రవేయటమే కాకుండా అతను చనిపోయేంత వరకు వెంటాడి, వేధించారు. చివరకు కోర్టులు చివాట్లు పెట్టినా ప్రభుత్వాలకు కనీస స్పందన లేదు. రక్షణ చట్టాలు, అట్రాసిటీ చట్టాలు నేటి సమాజంలో అగ్ర వర్ణాలు, పెత్తందారుల చుట్టాలుగా మారాయి. పోలీసు వ్యవస్థ పూర్తిగా దేశంలో రాజకీయ పార్టీ, పెత్తందారుల, అగ్రవర్ణాల, ధనవంతుల కనుసన్నలలో కొనసాగుతోంది. రాష్ట్రంలో అనేక చోట్ల దళితులు, బడుగు, బలహీన వర్గాలు, మహిళలపై దాడులు, హత్యలు, అత్యా చారాలు జరుగుతున్నా కనీసం పోలీస్ స్టేషన్‌లలో కేసులు కూడా నమోదు కావటం లేదు. దాడి చేసిన పెత్తందారులు పోలీస్ స్టేషన్‌లలో కేవలం 5 నిమిషాల మించి ఉండటం లేదు. బాధితులు మాత్రం అదే పోలీస్ స్టేషన్‌లలో ముద్దాయిలుగా మారి జైళ్లకు పోతున్నారు. ఎంతో రక్షణగా ఉండాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వాలు నీరు గారుస్తున్నాయి. ఇప్పటివరకు ఎంతమంది దళితులు హత్యకు గురయ్యారో, దాడులకు గురయ్యారో, అత్యాచార బాధితులుగా రోదిస్తున్నారో నిగ్గు తేల్చు కోవాల్సిన సమయం ఆసన్నమయ్యింది. దేశంలో కులవివక్ష లేని ప్రాంత మెక్కడుందో పాలకులే చెప్పాలి. ప్రతి ఏడాది బడ్జెట్ లక్షల కోట్లు కేటాయిస్తున్నారు. ఈ ఫలాలు ఎవరికి దక్కుతున్నాయో, ఎవరికి అందుతున్నాయో పాలకులు చెప్పాలి. అధికారంలో ఉన్నవారే ప్రభుత్వ పెద్దల అండతో ఇంత దుర్మార్గాలకు ఒడిగడుతున్నా కనీసం సానుభూతిని చూపేవారు కరువయ్యారు. ఇలాంటి ఘటనలు ఎదుర్కోవాలంటే దళితులు, బహుజనులు ఐక్యం కావాలి. పోరాటాలకు సన్నద్ధం కావాలి. పోరాటాలే లక్ష్యసాధనకు ఉన్న ఏకైక మార్గం. ఈ మార్గంలో అనేక ఒడిదొడుకులు ఉన్నా వాటిని ఎదుర్కొనేందుకు అనేక త్యాగాలకు సిద్ధం కావాలి. ప్రభుత్వ ఎజెండాను ఎప్పటికప్పుడు పరిశీలించాలి, వారి మోసాలను ఎప్పటికప్పుడు గమనించాలి. వాటిని బహిర్గతం చేస్తూ, ఎండగడుతూ, పాలకుల నైజాన్ని అంచనా వేస్తూ మన పోరాటాలు ముందుకు సాగాలి. అందుకు అనుగుణంగా దళితులు చైతన్యం అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనకిచ్చిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. పాలకులు మంచి వారైతే ప్రజలు బాగుంటారు. అటువంటి నాయకులు మన నుండే పుట్టుకురావాలి. మనమే తయారు చేసుకోవాలి.

వ్యాస రచయిత దళిత హక్కుల పోరాట సమితి
(డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
7893530894

బీహార్ ఎన్డీఏలో లుకలుకలు

- నితీశ్ పాలనపై బీజేపీ తిరుగుబాటు
- సొంత అధికారం కోసం పాట్లు
- తప్పంతా బీజేపీదే
- జేడీయూ సీనియర్ నేత ఉపేంద్ర కుష్వాహా

పాట్నా: బీహార్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమిలో లుకలుకలు ప్రారంభమైనట్టు తెలుస్తోంది. వివిధ రాష్ట్రాల్లో వివిధ పద్ధతుల్ని అమలు చేస్తూ అధికార పగ్గాలు చేపడుతున్న బీజేపీ అగ్రనాయకత్వం చూపు ఇప్పుడు బీహార్‌పై పడినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తాము కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న ప్రభుత్వంపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. చాలాకాలంగా సీఎంగా పని చేస్తున్న నితీశ్‌కుమార్ పరిపాలనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్ వీలు దొరకినప్పుడల్లా విమర్శలు చేస్తున్నారు. కేంద్రం నుంచి అందుతున్న నిధులను వినియోగించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపిస్తున్నారు. దేశ వ్యాప్తంగా అగ్నిపథ్ ఆందోళనల్లో బీహార్‌లో జరిగిన ఆందోళనలు కీలకమైన నేపథ్యంలో అందుకు బీహార్ ప్రభుత్వం మద్దతు ఉందని నర్మగర్భవ్యాఖ్యలు చేశారు. పోలీసులను వినియోగించి ఆందోళనలను ఎందుకు కట్టడి చేయలేకపోయారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనాభా నియంత్రణ చర్యలకు వ్యతిరేకంగా ఉండడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ నితీశ్ పాలనపై నిత్యం విమర్శలు గుప్పిస్తుండడంతో రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య సంబంధాలు బలహీనమవుతున్నాయనే సంకేతాలు వెలువడ్డాయి. దీనికి తోడు రాష్ట్రపతిగా ఎన్నికైన ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారానికి సీఎం నితీశ్ హాజరుకాకపోవడంతో ఈ అనుమానాలకు బలం చేకూరిందనే వాదనలు బయలుదేరాయి. ఈ నేపథ్యంలో రెండు పార్టీలు మరెంతో కాలం కలసి ప్రయాణించే అవకాశం ఉందోననే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ వారం చివరిలో కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించేలా బీజేపీ నేతలు షెడ్యూల్ ఖరారు చేయడం వంటి తాజా పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని గరిలించాయి. ఈ తాజా పరిణామాలపై జేడీయూ కీలక నేత జేడీయూ ఉపేంద్ర కుష్వాహా తీవ్రంగా స్పందించారు. సీఎం నితీశ్‌కుమార్ అధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై రాష్ట్ర బీజేపీ నేతలు వరుసగా విమర్శలు చేస్తూ అనవసర రాద్ధంతం చేస్తోందని దుయ్యబట్టారు. పాలనలో భాగస్వామ్యంగా ఉండి దేశ వ్యతిరేక, ఉగ్రవాద కార్యకలాపాలకు బీహార్ నిలయం అవుతోందని బీజేపీ నేతలు పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి తీరును తప్పుపట్టారు.

రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య పెద్ద సమస్యలు లేకపోయినా బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు ప్రజల్లో పాలనపై తప్పుడు అభిప్రాయానికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు. పరిపాలన యంత్రాంగం సమర్థవంతంగా పని చేస్తోందని పేర్కొన్నారు. బీజేపీ కీలక నేతలు రాష్ట్రంలో పర్యటించడం తమకు సంబంధించిన విషయం కాదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలనాటికి పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్నకు భవిష్యత్తులో ఏమి జరగబోతోందో ఎవరు అంచనా వేయలేమని పేర్కొనడం గమనార్హం.

విడిపోయిన ముంబై-పాట్నా ఎక్స్‌ప్రెస్ బోగీలు

ముంబై : ముంబై నుంచి పాట్నా వెళుతున్న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సంబంధించిన కొన్ని బోగీలు మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో విడిపోయినట్టు భారతీయ రైల్వే తెలిపింది. భుసావాల్ డివిజన్‌లోని చలీస్‌గావ్-వాఘ్లీ స్టేషన్‌ల మధ్య మంగళవారం మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్టు సెంట్రల్ రైల్వే ప్రజాసంబంధాల అధికారి శివాజీ సుతార్ తెలిపారు. రైలులోని ఐదు, ఆరు బోగీలు విడిపోయాయని... రైల్వే సిబ్బంది విడిపోయిన బోగీలను మళ్లీ జత చేసి సమస్యను పరిష్కరించినట్టు వివరించారు. ఈ ఘటనలో ప్రయాణికులు ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదని తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ వద్ద లోకల్ రైలు పట్టాలు తప్పడంతో హార్బర్ లైన్‌లో ప్రయాణించే రైలు సేవలు ప్రభావితమైనట్టు అధికారులు తెలిపారు.

బీఎస్పీతో చర్చలు జరపలేదు : ఎస్‌బీఎస్పీ

లక్నో: మాయావతి నేతృత్వంలోని బీఎస్పీతో తమ పార్టీ అధినేత ఓం ప్రకాశ్ రాజ్‌భర్ చర్చలు జరుపలేదని సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్పీ) అధికార ప్రతినిధి అరుణ్ రాజ్‌భర్ తెలిపారు. తమ పార్టీ అధ్యక్షుడు బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాంతో కలసి పని చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మాయావతి పాలనపై ఆయన ఆలోచనలను వెల్లడించారని వివరణ ఇచ్చారు. సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు ఉండదని ఓం ప్రకాశ్ రాజ్‌భర్ ఇటీవలే ప్రకటించడం, అనంతరం మాయావతి పాలన తీరుపై ప్రశంసలు కురిపిండం, అఖిలేశ్‌పై విమర్శలు చేసిన నేపథ్యంలో ఆ రెండు పార్టీల మధ్య సంబంధాలు బలపడుతున్నాయనే వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో విలేకరులుతో స్పందించిన ఎస్‌బీఎస్పీ నేత అరుణ్ రాజ్‌భర్ తమ పార్టీకి ఒక భావజాలం ఉందని, దాని ఆధారంగానే పని చేస్తామని చెప్పారు. తాము బీఎస్పీతో చర్చలు జరుపలేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో ప్రతి అంశమూ ప్రాధాన్యతను పొందుతుందని...రాజకీయ సమీకరణలు కూడా మారుతూనే ఉంటాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీజేపీతో పొత్తు ఉంటుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు...ఆ విషయంపై స్పందించేందుకు ఇది సరైన సమయం కాదని దాటవేశారు

గుజరాత్ కల్తీ మద్యం ఘటనలో... 33కి చేరిన మృతుల సంఖ్య

బొటాడ్: గుజరాత్‌లో కల్తీ మద్యం తాగి మరణించిన వారి సంఖ్య 33కి చేరుకుంది. ఒక్క బొటాడ్ జిల్లాలోనే ఇప్పటి వరకు 16 మంది మృతి చెందినట్లు జిల్లా పోలీసు కంట్రోల్ రూం అధికారులు ధ్రువీకరించింది. జిల్లాకు పొరుగున ఉన్న అహ్మదాబాద్ జిల్లాలోని ధంధూకా తాలూకాకు చెందిన ఐదుగురు బాధితులు సోమవారం మృతి చెందినట్టు తెలిపారు. భావ్‌నగర్, బోటాడ్, బర్వాలా, ధంధూకాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇప్పటికీ 30 మంది కల్తీ మద్యం బాధితులు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కల్తీ మద్యం వ్యవహారంలో బొటాడ్ జిల్లాకు చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నామని గుజరాజ్ డీజీపీ ఆశిశ్ భాటియా తెలిపారు.

నిందితులు నకిలీ మద్యాన్ని తయారు చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. బర్వాలా ప్రాంతంలోని రోజిద్ తదితర గ్రామాలకు చెందిన వారు మద్యం తీసుకున్న తరుణంలో తీవ్ర అనారోగ్యానికి గురవడంతో వారందరినీ బొటాడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో కల్తీ మద్యం వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనపై డీసీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, అహ్మదాబాద్‌లోని క్రైమ్ బ్రాంచ్ అధికారులు కూడా విచారణలో భాగస్వామ్యం అవుతాయని వివరించారు.

ఆ రుణాలు ప్రభుత్వ పరిధిలో చేర్చొద్దు

- రుణ పరిమితిని తగ్గించడం దారుణం
- రాష్ట్రాల రుణ అధికారాలకు, అభివృద్ధి ప్రణాళికలకు 'అపాయం'
- రాజ్యాంగాన్ని మించిన కేంద్రం ఆలోచనలపై ఆందోళన
- నిర్మలా సీతారామన్‌కు కేరళ ఆర్థిక మంత్రి లేఖ

తిరువనంతపురం : దక్షిణాది రాష్ట్రం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఆగస్టు 2017కి ముందు ఉన్న పరిస్థితుల ప్రకారం, నికర రుణ సామర్థ్యాన్ని నిర్ణయించేటప్పుడు రాష్ట్రాల పబ్లిక్ ఖాతాలో నిల్వలు, వాటిచే నిర్వహించబడుతున్న సంస్థల ద్వారా రుణాలను మినహాయించాలని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్... కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అభ్యర్థించారు. రాష్ట్రాల నికర రుణ పరిమితిని నిర్ణయించడంపై గత ఐదేళ్లలో కేంద్రం తీసుకున్న కొన్ని చర్యలపై ఆందోళనలు లేవనెత్తారు. చట్టబద్ధమైన సంస్థలు, కంపెనీల వంటి రాష్ట్ర సాధనాల బాధ్యతలు రాష్ట్ర రుణ నిర్వచనం పరిధిలోకి రావని వాదించారు. అందువల్ల, అటువంటి సంస్థల రుణాలను రాష్ట్ర ప్రభుత్వంతో కలపడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని, రాష్ట్రాల రుణ అధికారాలకు, వారి అభివృద్ధి ప్రణాళికలకు 'అపాయం' కలిగిస్తుందని జులై 22 నాటి తన లేఖలో ఆయన పేర్కొన్నారు. కేరళ మౌలిక సదుపాయాల పెట్టుబడి బోర్డు (కేఐఐఎఫ్‌బీ), కేరళ రాష్ట్ర సామాజిక భద్రత పెన్షన్ లిమిటెడ్ (కేఎస్ఎస్‌పీఎల్) వంటి ప్రత్యేక ప్రయోజక వాహకాల ద్వారా తీసుకునే రుణాలకు రాష్ట్రం ఇచ్చిన హామీని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ అప్పుగా నిర్వచించినందున ఈ విషయం ప్రాముఖ్యతను సంతరించుకుంది. జులై 25న, సీతారామన్ లోక్‌సభలో వ్రాతపూర్వక సమాధానంలో, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు లేదా వారి ప్రత్యేక ప్రయోజన వాహనాల (ఎస్‌పీవీలు) ద్వారా రుణాలు తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి అవసరమైన రుణంగా పరిగణించడం జరుగుతుందని చెప్పారు.

మరోవైపు, కేరళ ఆర్థిక మంత్రి తన లేఖలో 'చట్టబద్ధమైన సంస్థలు, కంపెనీల వంటి రాష్ట్ర ప్రభుత్వం ఇతర సాధనాల బాధ్యతలు రాష్ట్ర రుణ నిర్వచనం పరిధిలోకి రావు' అని వాదించారు. 'రాష్ట్రం ఆధీనంలో ఉన్న చట్టపరమైన సంస్థల అప్పులు, రాష్ట్ర ప్రభుత్వ సాధారణ రుణాలను కలపడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధం. ఇది రాష్ట్రాల రుణ అధికారాలను దెబ్బతీస్తుంది. దాని వివిధ సంస్థల ద్వారా సాధించాలనుకునే అభివృద్ధి ప్రణాళికలను దెబ్బతీస్తుంది' అని ఆయన తెలిపారు. బాలగోపాల్ తన లేఖలో, కేరళ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఇది పేదలకు గృహాలు, విద్య, ఆరోగ్యంతో సహా ఇతర సంక్షేమ పథకాలపై ఖర్చు చేయడంలో ప్రభుత్వానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తుందని పేర్కొన్నారు. 'ఈ సంవత్సరం రెవెన్యూ లోటు గ్రాంట్‌ను దాదాపు రూ.7 వేల కోట్లకు తగ్గించడం, దాదాపు రూ.12 వేల కోట్ల జీఎస్‌టీ పరిహారం నిలిపివేయడం వల్ల నష్టం వాటిల్లడం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్రంగా ప్రభావం చూపింది' అని తెలిపారు. 'అంతేకాకుండా, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఏకపక్షంగా బడ్జెట్ యేతర రుణాల పేరుతో రాష్ట్రం నికర రుణ పరిమితులను సుమారు రూ.4 వేల కోట్ల వరకు తగ్గించింది. మొత్తం మీద, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌కు ఆర్థిక సహాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తనకు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులలో రూ.23 వేల కోట్ల తగ్గింపుతో పోరాడవలసి ఉంటుంది' అని అన్నారు. 'కోవిడ్ మహమ్మారి వల్ల ఏర్పడిన ఆర్థిక బలహీనత' నుంచి బయటపడటానికి పోరాడుతున్న కేరళ ఎదుర్కొంటున్న ఈ వాస్తవాలను కేంద్రం గుర్తించకపోతే, గత కొన్ని దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రం నిర్మించిన సామాజిక-ఆర్థిక భద్రతా వ్యవస్థ ప్రమాదంలో ఉంటుంది' అని బాలగోపాల్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 293లోని నిబంధన (3) ప్రకారం ఒక రాష్ట్రం తప్పనిసరిగా సమ్మతిని పొందాలనే నిబంధన ఒక రాష్ట్రం కేంద్రానికి అప్పుగా ఉన్నప్పుడు లేదా కేంద్రం గ్యారెంటీ ఇచ్చి తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేటప్పుడు మాత్రమే వర్తిస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం చేస్తున్నది 'రాజ్యాంగంలో ఆలోచించిన దానికంటే చాలా మించినది' అని అన్నారు.

ఆరుగురు అవినీతి అధికారులపై... సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ : అధికార దుర్వినియోగంతో పాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) అధికారులపై రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయాన్ని గవర్నర్ కార్యాలయ వర్గాలు ధృవీకరించాయి. ఎంసీడీ అధికారులను సస్పెండ్ చేస్తూ ఎల్జీ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. కరోల్ బాగ్‌లో అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించారనే ఆరోపణలపై స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను విచారించడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులకు అనుమతి కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ఢిల్లీ ప్రభుత్వం సహా ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీలో పని చేస్తున్న అధికారులపై వచ్చిన అవినీతి ఫిర్యాదులను పరిశీలించి ఎల్జీ తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

మంత్రి పార్థ ఛటర్జీని వెంటనే తొలగించాలి మమతను కోరిన అధీర్ రంజన్ చౌదరి

కోల్‌కతా: రాష్ట్రంలో పాఠశాల ఉద్యోగాల కుంభకోణంతో సంబంధం ఉన్న కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన మంత్రి పార్థ ఛటర్జీని తక్షణమే తొలగించాలని కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి... పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కోరారు. పాఠశాల సేవల కమిషన్ (ఎస్ఎస్‌సీ) ద్వారా జరిగిన నియామకాల ప్రక్రియలో 'అక్రమాలు' అనేది 'బహిరంగ రహస్యం' అని బెనర్జీకి రాసిన ఒక లేఖలో ఆయన పేర్కొన్నారు.

'పార్థ ఛటర్జీ చేసిన దుర్మార్గానికి సంబంధించి నేను ఈ లేఖ రాస్తున్నాను. ఆయన 2014-2021 మధ్య విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. కోర్టు జోక్యం తర్వాతే దర్యాప్తు సంస్థలు దానిపై చర్యలు తీసుకోవడం ప్రారంభించాయి. ఇది పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి పెద్ద మచ్చ. పార్థ ఛటర్జీని తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని మిమ్మల్ని కోరుతున్నాను' అని బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. ఈడీ శనివారం ఛటర్జీని అరెస్టు చేసింది. ఈ కుంభకోణంలో అరెస్టయిన తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆయన సహచరురాలు అర్పితా ముఖర్జీకి సిటీ కోర్టు సోమవారం 10 రోజుల ఈడీ కస్టడీని మంజూరు చేసింది.

'అసలు' శివసేన గుర్తింపుపై 1న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : మహారాష్ట్ర రాజకీయ పరిణామాలకు సంబంధించిన న్యాయ బద్ధ అంశాలన్నింటిని సర్వోన్నత న్యాయస్థానం గమనిస్తూనే ఉంది. 'అసలు' శివసేన వివాదం ముదిరిన క్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చేసే దావా (తమదే నిజమైన శివసేన అని)పై భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) కార్యకలాపాలకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని మంగళవారం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఉద్ధవ్ ఠాక్రే వర్గం కోరింది. 'అసలు' శివసేనగా విల్లు-బాణం గుర్తు తమకే దక్కాలన్నదని షిండే వర్గం వాదన. ఈ క్రమంలో ఈసీఐ కార్యకలాపాలను నిలువరించరించాలని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, దేవదత్ కామత్ భారత ప్రధనా న్యాయమూర్తి ఎన్వీ రమణ నేతృత్వ ధర్మాసనాన్ని మౌఖికంగా కోరారు. మహారాష్ట్ర రాజకీయ పరిణామాలను గమనిస్తున్న న్యాయస్థానం అందుకు సంబంధించి చట్టబద్ధ సమస్యలనూ మొదటి నుంచి పరిశీలిస్తూనే ఉంది. 'వారు (షిండే వర్గం) పార్టీ, పార్టీ గుర్తు కోసం దావా చేస్తున్నారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ తమ పనిని చేసుకుపోతోంది' అని సిబల్ వాదించారు. షిండే తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపించారు. కొందరు సభ్యులపై అనర్హత వేటు వేయకుండా మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్టే మాత్రమే సుప్రీంకోర్టు విధించిందని అన్నారు. ఈసీఐ కార్యకలాపాలు పూర్తిగా భిన్నమని చెప్పారు. సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేసిన తర్వాత ఆగస్టు 8న విచారణకు ఈసీ నోటీసులు జారీ చేసిందన్నారు. ఠాక్రే వర్గం దరఖాస్తును మహారాష్ట్ర సంక్షోభం నేపథ్య ఇతర కేసులతో పాటు ఆగస్టు 1న విచారిస్తామని సీజేఐ పేర్కొన్నారు. అయితే ఈ కేసు విచారణ నేపథ్యంలో వెనక్కుతీసుకునేందుకు వీలులేని చర్యలను నివారించేందుకుగాను ఎటువంటి కార్యకలాపాలను సాగించవద్దని తాము చేసిన విన్నపాన్ని ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదని ఠాక్రే వర్గం తమ దరఖాస్తులో పేర్కొంది. ఠాక్రే, షిండే వర్గం మధ్య వివాదం, పార్టీ చీలిక సంబంధిత అంశాలను లోతుగా పరిశీలించేందుకు న్యాయస్థానం ఇంతకుముందే అంగీకరించింది.

అనవసర ప్రకటనలు వద్దు

కాంగ్రెస్ ఎమ్మెల్యే జమీర్‌కు అధిష్టానం హెచ్చరిక

బెంగుళూరు: అనవసర ప్రకటనలు చేయవద్దని కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ ఖాన్‌ను అధిష్టానం హెచ్చరించింది. పార్టీ క్రమశిక్షణకు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని సూచిస్తూ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలా సదరు ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే జమీర్ ఖాన్ ఇటీవల రాష్ట్రంలో వక్కలింగ సామాజిక వర్గం కన్నా ముస్లింల జనాభా అధికంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ వక్కలింగ సామాజిక వర్గాన్ని తమవైపు తిప్పుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే స్పందించిన పార్టీ అధిష్టానం అనవసర ప్రకటనలు ఎందుకని ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ ఖాన్‌ను హెచ్చరించింది. కుల, మత విభేదాలకు దూరంగా ఉండాలని సుర్జేవాలా సూచించినట్టు మీడియా కథనాలు వెలువడ్డాయి. ఈ హెచ్చరికలపై దావణగిరిలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే సమాధానమిస్తూ...తనకు ఎటువంటి నోటీసులు రాలేదని...పూర్తి సమాచారం లేకుండా ఎలా స్పందించాలని పేర్కొన్నారు. డీకే శివకుమార్ విషయాన్ని ప్రస్తావిస్తే...ఆయన చాలా బిజీగా ఉంటారని, తన గురించి ఎందుకు స్పందిస్తారని వ్యాఖ్యానించారు. తనకు నోటీసు వచ్చినట్టు మీడియాలోనే చూశానని...తనకు వచ్చినది నోటీసు కాదని లేఖ అయి ఉంటుందని పేర్కొన్నారు.

పంజాబ్ ఏజీగా అన్మోల్ రతన్ సిద్ధూ

చండీగఢ్: పంజాబ్ కొత్త అడ్వకేట్ జనరల్ (ఏజీ)గా సీనియర్ న్యాయవాది అన్మోల్ రతన్ సిద్ధూని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎనిమిది సార్లు పంజాబ్, హరియాణా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగిన సిద్ధూ మాట్లాడుతూ తన జీతాన్ని డ్రగ్స్ బానిసల చికిత్సకు, వారి పునరావాసానికి విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. 'పంజాబ్ గవర్నర్, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 165 కింద అందించిన అధికారాలను అమలు చేస్తూ, పంజాబ్, హరియాణా హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ అన్మోల్ రతన్ సిద్ధూను పంజాబ్ రాష్ట్రానికి అడ్వకేట్ జనరల్‌గా నియమించడం పై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమలులోకి వస్తుంది' అని హోం వ్యవహారాలు, న్యాయ శాఖ ఉత్తర్వులు పేర్కొన్నాయి.

'మాదకద్రవ్యాల మహమ్మారిపై, అటువంటి గ్రామాలకు చేరుకుని, మాదకద్రవ్యాల బానిసల చికిత్స, వారి పునరావాసం కోసం పంజాబ్ ఏజీగా నా జీతం విరాళంగా ఇస్తాను' అని సిద్ధూ ఒక ట్వీట్‌లో తెలిపారు.

రాష్ట్రపతితో మాజీ రాష్ట్రపతి భేటీ

న్యూఢిల్లీ: భారత 15వ రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన ద్రౌపది ముర్ముకు ప్రధాని నరేంద్రమోదీ, మాజీ రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌తో పాటు కొందరు గవర్నర్లు రాష్ట్రపతి భవన్‌లో కలిసినట్లు రాష్ట్రపతి సెక్రటేరియట్ ట్వీట్ చేసింది. మాజీ రాష్ట్రపతి ప్రతిభా దేవీసింగ్ పాటిల్ తన కుమార్తెతో కలిసి ముర్ముతో భేటీ అయ్యారని, ఒడిశా, చత్తీస్‌గఢ, రాజస్థాన్, బీహార్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల గవర్నర్లు కూడా రాష్ట్రపతి భవన్‌లో ఆమెను కలిశారని వరుస ట్వీట్లలో పేర్కొంది.

ధన్కర్ 'సుప్రీం' చాంబర్ రేసులో లేరు

న్యూఢిల్లీ : ఎన్డీయే తరపు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయనున్న జగదీప్ ధన్కర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టు ప్రాంగణంలో చాంబర్ కేటాయింపు రేసు నుంచి తప్పుకున్నారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ లేఖ ద్వారా సర్వోన్నత న్యాయస్థానంలో సంబంధిత రిజిస్ట్రార్‌కు తెలిపారు. ఈ ప్రక్రియ నుంచి ధన్కర్ పేరును తొలగించినట్లు చెప్పారు. బార్ ప్రయోజనాల దృష్ట్యా ధన్కర్ స్వచ్ఛందంగా వెనక్కి తగ్గినట్లు వెల్లడించారు. చాంబర్ల కేటాయింపు కోసం న్యాయవాదుల జాబితాను పున:పరిశీలించాలన్నారు.

సీఎం అభ్యర్థిత్వంపై సిద్ధ, డీకే మధ్య మాటల యుద్ధం

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పీఠానికి సంబంధించి అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఆ పార్టీలోని ఇద్దరు సీనియర్ నేతలు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం అభ్యర్థిత్వంపై మాటల యుద్ధం జరుగుతంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే తమ పార్టీ నుంచి తదుపరి సీఎం ఎవరన్నదే వీరి మధ్య వివాదం. అయితే ముందు పార్టీని అధికారంలోకి తెచ్చేలా పనిచేయండి అంటూ పార్టీ సభ్యులకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ సూచించారు. సిద్ధరామయ్య తదుపరి ముఖ్యమంత్రి అని ఎమ్మెల్యే బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలపై 'నేను నా స్థాయి వారి గురించే మాట్లాడతా. అంతా తమ నోళ్లు కట్టిపెట్టుకోవాలి. పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు శ్రమించండి' అని డీకే అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో పది నెలలు ఉన్న క్రమంలో కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ఎవరన్న చర్చ శివకుమార్, సిద్ధరామయ్య క్యాంపుల్లో జోరుగా సాగుతోంది. పర్యవసానంగా ఇరు వర్గాల మధ్య మాటలతూటాలు పేలుతున్నాయి. ఇదే క్రమంలో ఓ విలేకరి ప్రశ్నకు శివకుమార్ పై విధంగా స్పందించారు. పార్టీ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే వ్యక్తులను స్తుతించడాన్ని మాని పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషిచేయాలని సూచిస్తున్నా అని అన్నారు. అన్ని వర్గాలను పార్టీ వైపునకు తీసుకు రండి.. ముందు మీ వర్గాన్ని క్రమబద్ధీకరించండి' అని ఖాన్‌ను ఉద్దేశించి అన్నారు. ముఖ్యమంత్రి కావాలని పార్టీలోని 224 ఎమ్మెల్యేలు అనుకున్నా అందులో తప్పులేదని డీకే శివకుమార్ చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలకు ఖాన్ స్పందించారు.

'ఈ వాదనను ప్రారంభించింది ఎవరు? వక్కాలిగా వర్గం నుంచి ఒక్క అవకాశమివ్వమని కోరింది ఎవరు? ఆయన ప్రకటన తర్వాతేకదా మేమంతా ఈ విషయమై మాట్లాడుతున్నాం. అప్పటివరకు ఏ ఒక్కరూ ఈ ప్రస్తావన తేలేదు' అని శివకుమార్‌ను ఉద్దేశించి బెళగావిలో విలేకరులతో ఖాన్ అన్నారు. ముస్లిం నేతలంతా సిద్దను సీఎంగా చూడాలని అనుకుంటున్నారని చెప్పారు. తుది నిర్ణయం అధిష్టానానిదే అని, ఈ నిర్ణయాధికారం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకే ఉందని, వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించడంలో తప్పేమీ లేదు అని ఖాన్ అన్నారు. పార్టీతో పాటు వ్యక్తులను స్తుతించడం కూడా అవసరమే అని ఆయన నొక్కిచెప్పారు. కర్ణాటక కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై ఆ పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే స్పందించారు. కాలబుర్గిలో ఉన్న ఆయన అక్కడి విలేకరులతో మాట్లాడుతూ, తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది అధిష్టానమే నిర్ణయిస్తుంది. దానిని నేను నిర్ణయించలేను. ముందు పార్టీని అధికారంలోకి తేవాలి' అని అన్నారు. సిద్ధరామయ్య 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆగస్టు 3న సిద్ధరామోత్సవాన్ని దేవనాగరేలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకుగాను సిద్ధరామయ్యకు అనుకూలమైన ఖాన్ వంటి ఎమ్మెల్యేంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

జీఎస్‌టీ... ధరల పెరుగుదలపై చర్చకు ఎందుకు అనుమతించరు...?

పార్లమెంట్‌లో కాంగ్రెస్ నిరసన

న్యూఢిల్లీ : పార్లమెంటులో ప్రతిష్ఠంభన నడుమ, ప్రతిపక్ష పార్టీలన్నీ ధరల పెరుగుదల, జీఎస్‌టీపై అత్యవసర చర్చకు ప్రభుత్వం ఎందుకు అనుమతించడం లేదని కాంగ్రెస్ మంగళవారం ప్రశ్నించింది. నోట్ల రద్దు, జమ్ముకశ్మీర్, వ్యవసాయ సంక్షోభం తదితర అంశాలపై గతంలో చాలాసార్లు 267 నిబంధన కింద చర్చ జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ అన్నారు. 'మొత్తం ప్రతిపక్షాలు ధరల పెరుగుదల, జీఎస్‌టీపై అత్యవసర చర్చను రాజ్యసభలో 267 నిబంధన కింద డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిబంధన అనేక సార్లు అమలయింది. ఇటీవల 16.11.16న నోట్ల రద్దుపై చర్చకు, 10.08.16న జమ్ముకశ్మీర్‌పై చర్చించడానికి, అలాగే, వ్యవసాయ సంక్షోభంపై చర్చకు 23.04.15న అమలయింది. మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు నిరాకరిస్తోంది' అని ప్రశ్నించారు. ధరల పెరుగుదల, జీఎస్‌టీపై అత్యవసరంగా చర్చించాలన్న డిమాండ్‌పై ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో పార్లమెంటు ఉభయ సభలు ముఖ్యమైన వ్యవహారాలను నిర్వహించడంలో విఫలమయ్యాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోవిడ్-19 నుంచి కోలుకుని తిరిగి వచ్చిన తర్వాత చర్చలు జరుపుతామని ప్రభుత్వం పేర్కొంది.

గవర్నర్‌కు రాజకీయాలతో పనేంటి

తమిళిసైని తప్పించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను వెంటనే రీ కాల్ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆమె తన పరిధికి మించి రాజకీయపరమైన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. గవర్నర్ పదవి అనేది రాజకీయాలకు సంబంధం లేనిదని పేర్కొన్నారు. అయితే ఆ విషయాన్ని పక్కనపెట్టిన గవర్నర్ రాజకీయ నేత తరహాలో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రాలేదని, రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలకు పోలేదని, అసెంబ్లీని కూడా రద్దు చేయడం సాధ్యం కాదని తన పరిధిలోకి రాకూడని రాజకీయపరమైన అంశాలను మాట్లాడడాన్ని తప్పుబట్టారు. గవ ర్నర్‌గా ఉంటూనే పొలిటికల్ స్టేట్‌మెంట్లు ఇవ్వ డాన్ని వ్యతిరేకించారు. సీఎం కేసీఆర్ రాజకీయ విధానాలపై తమకు కొన్ని అవగాహనలు ఉన్నా యని, రాజకీయ విభేదాలు కూడా ఉన్నాయని చెప్పారు. కేసీఆర్ జాతీయ రాజకీయల్లోకి వచ్చి ఏమి చేస్తారో తెలియదని, బీజేపీకి వ్యతిరేకంగా కూటమి కడితే మంచి దేనని పేర్కొన్నారు. ఆయన రాజకీయాలపై తమకు చాలా అనుమానాలు ఉన్నాయన్నారు. కేసీఆర్‌ను రాజకీయ విధానాల ఆధారంగా విమర్శిస్తామని అయితే గవర్నర్‌కు ఆ పని ఎందుకని ప్రశ్నించారు. గవర్నర్ పాత్ర వేరుగా ఉండాలని పేర్కొన్నారు. తన పరిధికి మించి రాజకీయ వ్యాఖ్యలు చేసిన గవర్నర్ తమిళిసైని వెంటనే రీకాల్ చేయాలని డిమాండు చేశారు.

5,25,997 కోవిడ్ మరణాలు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ కేసులు-మరణాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే వైరస్ బారిన పడి 5,25,997 మంది మరణించినట్లు కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ మంగళవారం రాజ్యసభకు రాపూర్వకంగా తెలిపారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కోవిడ్ కేసులు, మరణాలపై ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. 'దేశంలో వైద్యులు, ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలతో కలిపి 2022, జులై 23నాటికి మొత్తం 5,25,997 మంది మరణించారు. వృత్తిపరంగా విడదీసిన డేటా కేంద్రం వద్ద లేదు' అని తెలిపారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద కోవిడ్ విధుల్లో ఉండే వైద్యారోగ్య సిబ్బందికి రూ.50 లక్షల బీమా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య-ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రులు, పట్టణ-గ్రామీణ వాలంటీర్లకు, ఒప్పంద, దినసరి వేతన/అడ్‌హాక్/ఔట్‌సోర్సింగ్ సిబ్బందికీ కవరేజి ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ పథకం అమలవుతోందని పేర్కొన్నారు. జాతీయ విపత్తు నియంత్రణ యంత్రాంగం (ఎన్‌డీఎంఏ) మార్గదర్శకాల ప్రకారం కోవిడ్ వల్ల చనిపోయిన వారి కుటుంబానికి రూ.50వేల ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి అందిస్తారని మంత్రి తెలిపారు.

సిగరెట్టుతో కాల్చి...కుమారుడ్ని హింసించిన తండ్రిపై కేసు

థానే: తల్లితో కలుస్తున్నాడనే అక్కసుతో ఐదేళ్ల వయసున్న సొంత కుమారుడిని సిగరెట్టుతో కాల్చి హింసించిన తండ్రిపై మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలోని భివాండి పట్టణంలో నివాసం ఉంటున్న ఫహీమ్ రిజ్వాన్ అహ్మద్ ఖాన్ దంపతులు ఇటీవల విడిపోయారు. వారి కుమారుడు తండ్రి వద్ద ఉంటున్నాడు. అయితే తనను కలుస్తున్నాడనే అనుమానంతో ఫహీమ్ అహ్మద్ ఆ బాలుడిని సిగరెట్టుతో కాల్చి హింసించినట్టు చిన్నారి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు శాంతి నగర్ పోలీస్ స్టేషన్ సీనియర్ అధికారి సీతల్ రౌత్ తెలిపారు.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ఆద్యుడు

- పత్రికలను నియంత్రిస్తున్న కార్పొరేట్ శక్తులు
- ప్రాథమిక లక్ష్యాలను విస్మరించిన మీడియా రంగం
- చంద్రం స్ఫూర్తితో ప్రజల దృక్కోణంలో పత్రికా రచన అవసరం
- మద్దుకూరి చంద్రం స్మారకోపన్యాసంలో డీవీవీఎస్ వర్మ

మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ, వేదికపై హరినాథరెడ్డి, అజయ్‌బాబు, మంజరి. హాజరైనవారిలో ఓ భాగం.

విశాలాంధ్ర-విజయవాడ: ప్రత్యామ్నాయ జర్నలిజానికి ఆద్యుడు మద్దుకూరి చంద్రశేఖరరావు (చంద్రం)అని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు డీవీవీఎస్ వర్మ అన్నారు. ప్రజల దృక్కోణంలో పత్రికా రచనకు ఆయన పునాదులు వేశారని గుర్తుచేశారు. విశాలాంధ్ర వ్యవస్థాపక సంపాదకుడు, ఆంధ్రా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, స్వాతంత్ర్య సమరయోధుడు మద్దుకూరి చంద్రశేఖర రావు 48వ వర్ధంతి సభను మంగళవారం స్థానిక చుట్టుగుంటలోని విశాలాంధ్ర కార్యాలయం చంద్రం బిల్డింగ్స్‌లో నిర్వహించారు. 'ప్రజా దృక్కోణంలో పత్రికా రచన' అనే అంశంపై డీవీవీఎస్ వర్మ స్మారకోపన్యాసం చేశారు. వర్మ మాట్లాడుతూ మద్దుకూరి చంద్రం జాతీయోద్యమం నుంచి రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లారని, ఆ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారని చెప్పారు. ఆంధ్రాలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి విశేష కృషి చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమం, స్వతంత్ర భారతదేశ భవిష్యత్తులో రైతులు, కార్మికులు, కూలీలు, సామాన్యుల గొంతుక వినిపించేందుకు తీసుకొచ్చిన నవశక్తి, ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికలకు సంపాదకుడిగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారని పేర్కొన్నారు. మార్క్సిస్ట్ దృక్పథంలో సాహిత్య విమర్శ చేసిన తొలి వ్యక్తి ఆయనేనని తెలిపారు. ప్రజానాట్యమండలికి ఒక రూపాన్ని ఇచ్చి తీర్చిదిద్దినది చంద్రం అని గుర్తుచేశారు. జాతీయోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం, ప్రజా ఉద్యమాలు, జర్నలిజం, సాహిత్య విమర్శ, అభ్యుదయ సాహిత్య పునర్వికాస ప్రవంతుల మేలుకలయిక మద్దుకూరి చంద్రం అని వివరించారు. సాహిత్యం, సాంస్కృతిక, పత్రిక రంగాల్లో ఆయన చూపిన మార్గంలో నడవడం వల్లే నేటికీ కమ్యూనిస్టులకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నాయని వర్మ అభిప్రాయపడ్డారు. 230 ఏళ్ల పత్రికా రంగంలో అనేక మార్పులు వచ్చాయని చెప్పారు. స్వాతంత్ర్యానికి పూర్వం మూఢ నమ్మకాలను పారదోలి, సమాజాన్ని ప్రగతిపథంలో నడిపించాలని సంఘసంస్కర్తలు పత్రికలు నడిపారని తెలిపారు. జాతీయోద్యమ కాలంలో ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించడం, వలస వాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించడం కోసం ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా కొన్ని పత్రికలు వచ్చాయని, వాటిని ప్రముఖులు నడిపించారని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత రైతులు, కార్మికులు, కూలీలు, సామాన్యుల గొంతుక వినిపిం చేందుకు వామపక్ష పత్రికలు స్థాపించారని వివరించారు. ప్రస్తుతం పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా విస్తృతి పెరిగినా, సమాచారం మాత్రం కుంచించుకుపోతోందని చెప్పారు. దేశంలో 70 శాతం మీడియాను 10 నుంచి 15 కార్పొరేట్ సంస్థలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నియంత్రిస్తున్నాయని తెలిపారు. పత్రికా రంగం కార్పొరేట్ రంగంగా మారిపోయిందని, రైతులు, కూలీలు, కార్మికులు, పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని, ప్రకటనకర్తలను సంతృప్తిపరచడమే లక్ష్యంగా వార్తలు ప్రచురిస్తున్నారన్నారు. దేశంలో 75 శాతం మందికి సంబంధించిన వార్తలకు కేవలం 0.67 శాతం మాత్రమే పత్రికల్లో స్థలం ఇస్తున్నారని చెప్పారు. ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు మాత్రమే రైతులు, కార్మికులు, కూలీల వార్తలు, అత్యాచారాలకు గురైనప్పుడు మాత్రమే మహిళలకు సంబంధించిన వార్తలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇతర సమయంలో వారి సమస్యలను పట్టించు కోవడం లేదన్నారు. సరళీకరణ తర్వాత వ్యాపారులు, పాలకుల పునాదులు ఒకటే కావడం వల్ల పరస్పరం సహకరించుకుంటున్నారని, అందువల్లే 90 శాతం పత్రికలు, మీడియా సంస్థలు ప్రభుత్వ విధానాలను సమర్థిస్తున్నాయని అన్నారు. వాచ్‌డాగ్‌గా ఉండాల్సిన పత్రికలు, మీడియా రంగం తన ప్రాథమిక లక్ష్యాన్ని విస్మరించిన నేపథ్యంలో మద్దుకూరి చంద్రం స్ఫూర్తితో ప్రజల దృక్కోణంలో పత్రికా రచనకు పునరంకితం కావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రం రచనలను సమీకరించి పున:ముద్రించడం వల్ల వాటిని చదివి ప్రజల దృక్కోణం, మార్క్సిస్టు దృక్పథంతో వార్తలు రాసే విధానాన్ని నేటితరం నేర్చుకునే అవకాశం ఉంటుందని, ఆ దిశగా విశాలాంధ్ర విజ్ఞాన సమితి కృషి చేయాలని వర్మ సూచించారు.

విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ మార్క్సిస్టు దృక్పథంలో ప్రజల పత్రికగా విశాలాంధ్రను తీర్చిదిద్దడంలో చంద్రం విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం పత్రికల నిర్వహణ తీరు ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రజలను చైతన్యపరిచి, ప్రజా ఉద్యమాలకు కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దే దశ నుంచి రాజకీయ పార్టీల తరహాలో ఒక పత్రికపై మరొక పత్రిక దాడికి పాల్పడే స్థితికి చేరుకున్నాయని చెప్పారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలను ప్రజల అభిప్రాయాలుగా మలచి సమాజాన్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తు న్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను, అభిప్రాయాలను, ప్రభుత్వ విధానాలపై సద్విమర్శలను ప్రచురించినా ఓర్చుకోలేక ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రకటనలు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. సామాన్యుల గొంతు వినిపించాలనే లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీ నాయకులు అనేక త్యాగాలు చేసి విశాలాంధ్రను స్థాపించారని, ఈ పత్రిక అవసరం సమాజానికి ఉందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా లక్ష్య సాధన కోసం ముందుకు సాగుతామని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు మాట్లాడుతూ మద్దుకూరి చంద్రం పేరిట ఒక అవార్డును ప్రకటించి ఏటా ఒక జర్నలిస్టుకు ప్రదానం చేయాలని కోరారు. మద్దుకూరి చంద్రం కుమార్తె, సీనియర్ జర్నలిస్టు మంజరి మాట్లాడుతూ నూతనతరం ఆలోచనలకు అనుగుణంగా విశాలాంధ్రను తీర్చిదిద్దాలని సూచించారు. అవకాశం ఉన్న మేరకు ఎక్కువ మందికి పత్రిక చేరే విధంగా కృషి చేయాలన్నారు. తొలుత విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మోదుమూడి మురళీకృష్ణ స్వాగతం పలకగా, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రా నాయక్ అభ్యుదయ గేయాన్ని ఆలపించారు. మద్దుకూరి చంద్రం చిత్రపటానికి డీవీవీఎస్ వర్మ, పి.హరినాథరెడ్డి, మంజరి తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. డీవీవీఎస్ వర్మను హరినాథరెడ్డి సన్మానించగా, కూన అజయ్‌బాబు జ్ఞాపికను బహూకరించారు.

ఏపీ ఈఏపీసెట్‌లో అబ్బాయిల హవా

- ఇంజినీరింగ్-89.12, వ్యవసాయం-95.06 శాతం అర్హత
- ఇంజినీరింగ్‌లో సాత్విక్‌కు... వ్యవసాయంలో దినేశ్ కార్తీక్‌రెడ్డికి ప్రథమం
- రెండు వారాల్లోనే ఫలితాలు మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2022 ఫలితాలు వెల్లడయ్యాయి. మంగళవారం విజయవాడ లెమన్ ట్రీ హోటల్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఫలితాలను విడుదల చేశారు. ఇంజినీరింగ్, వ్యవసాయ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటి 10 స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి ప్రకటించారు. వ్యవసాయ విభాగంలో 95.06 శాతం, ఇంజినీరింగ్ విభాగంలో 89.12 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగంలో టాప్-10లో అంతా అబ్బాయిలే నిలిచారు. వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో టాప్-10లో 8 మంది అబ్బాయిలు కాగా, ఇద్దరు అమ్మాయిలు సత్తా చాటారు. ఈఏపీసెట్ 2022కు మొత్తం 3 లక్షల 111 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంజినీరింగ్‌కు 2,05,518 మంది, వ్యవసాయ విభాగానికి 93,532 మంది, మరో 1,061 మంది రెండు విభాగాల్లోనూ దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 1,49,118 మంది అమ్మాయిలు కాగా, 1,50,993 మంది అబ్బాయిలున్నారు. పరీక్షలకు 2,82,496 మంది హాజరవగా, 2,56,983 మంది ఉత్తీర్ణత అర్హత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో 1,94,752 మంది హాజరుకాగా, అందులో 1,73,572 మంది (89.12 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వ్యవసాయ విభాగానికి 87,744 మంది హాజరుకాగా, అందులో 83,411 మంది (95.06 శాతం) అర్హత సాధించారు. రాష్ట్రంలో మొత్తం 258 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, అందులో 1,48,283 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఫార్మసీలో 127 కళాశాలలు ఉండగా 16,700 సీట్లు ఉన్నాయి. త్వరలోనే ఆయా విభాగాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తారు.

టాప్ 10లో అబ్బాయిలే ముందంజ

ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగం: ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగంలో శ్రీసత్య సాయి జిల్లా హిందూపూర్‌కు చెందిన బోయ హారీస్ సాత్విక్ మొదటి ర్యాంక్ సాధించాడు. మొత్తం 160 మార్కులకుగాను 158.62 మార్కులు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన పోలు లక్ష్మీసాయి లోహిత్ రెడ్డి 158.56 మార్కులతో రెండో స్థానాన్ని సాధించారు. మెండా హిమవంశీ (శ్రీకాకుళం) 3వ ర్యాంకు, త్రాసుల ఉమేష్ కార్తికేయ (పార్వతీపురం మన్యం) 4వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం-హైదరాబాద్‌కు చెందిన గంజి శ్రీనాథ్ 5వ ర్యాంక్, జాస్తి యశ్వంత్ వీవీఎస్ 6వ ర్యాంక్, బుస శివ నాగ వెంకట ఆదిత్య 7వ ర్యాంక్ సాధించారు. వలవల చరణ్ తేజ (మల్కిపురం) 8వ ర్యాంక్, నందన్ మంజునాథ్ ఇమ్మడిశెట్టి (హైదరాబాద్) 9వ ర్యాంక్, నూతక్కి రిత్విక్ (మంగళగిరి) 10వ ర్యాంక్ సాధించి తమ సత్తా చాటారు.

వ్యవసాయ, ఫార్మసీ విభాగం: అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో గుంటూరు జిల్లా పెదకూరపాడుకు చెందిన వజ్రాల దినేష్ కార్తీక్‌రెడ్డి 155.57 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించాడు. మట్టా దుర్గాసాయి కీర్తి తేజ (జంగారెడ్డి గూడెం) రెండో ర్యాంక్, ఆసు ఇందు (పెనుగొండ, ప.గో. జిల్లా) 3వ ర్యాంక్, కల్లం తరుణ్ కుమార్‌రెడ్డి (గుంటూరు) 4వ ర్యాంక్, గునుకుంట్ల తత్వ మయూఖ (వైఎస్సార్ జిల్లా కడప) 5వ ర్యాంక్, చిలక పార్థేందర్ అజయ్ (కొవ్వూరు) 6వ ర్యాంక్, వీవీఎస్ శ్రీశశాంక్ గోపిశెట్టి (తెలంగాణ) 7వ ర్యాంక్, సారెడ్డి సాయి విఘ్నేష్‌రెడ్డి (తెలంగాణ) 8వ ర్యాంక్, సామల సాత్విక్‌రెడ్డి (తెలంగాణ) 9వ ర్యాంక్, కొక్కిలిగడ్డ స్టాన్లీ ప్రణహిత్ (ఆకివీడు) 10వ ర్యాంక్ సాధించారు.

త్వరలో కౌన్సెలింగ్: మంత్రి బొత్స సత్యనారాయణ

త్వరలోనే కౌన్సెలింగ్ తేదీలను ప్రకటిస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. అర్హులైన ప్రతి పేద, మధ్యతరగతి వారికి ఉన్నత విద్య అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తల్లిదండ్రులు వినియోగించుకుని పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందాలన్నారు. అర్హత సాధించిన ప్రతి విద్యార్థికీ మంత్రి అభినందనలు తెలిపారు. కరోనా పరిస్థితుల దృష్ట్యా గడిచిన రెండేళ్లు పరీక్షలు లేని కారణంగా, ఈ సారి ఇంటర్ మార్కులకు ఈఏపీసెట్ 2022లో ఎలాంటి వెయిటేజీ లేదని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఈఏపీసెట్‌లో జనరల్, ఓబీసీ విభాగంలో 25 శాతం (40 మార్కులు) వస్తే అర్హత సాధించినట్లుగా నిర్ధారిస్తామన్నారు. పరీక్షకు హాజరయిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులందరినీ అర్హత సాధించినట్లుగా ప్రకటించామని తెలిపారు. ఈఏపీసెట్-2022కు ఏప్రిల్ 4న ప్రకటన విడుదల చేయగా జూన్ 20వ తేదీ వరకూ దరఖాస్తులను స్వీకరించామని గుర్తుచేశారు. జులై 4 నుంచి 8వ తేదీ వరకూ ఇంజినీరింగ్ విభాగానికి, జులై 11, 12 తేదీల్లో వ్యవసాయ విభాగానికి పరీక్షలు నిర్వహించామని వివరించారు. పరీక్షలు నిర్వహించిన కేవలం రెండు వారాల్లోనే ఫలితాలు విడుదల చేసిన అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్యామలరావు, జేఎన్‌టీయూకే అనంతపురం వైస్ చాన్సలర్ రంగ జనార్ధన్, కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు లక్ష్మమ్మ, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పదివారాల తర్వాతే ఓటీటీ హక్కులు

భారీ చిత్రాల నిర్మాతల మండలి కీలక నిర్ణయం

హైదరాబాద్: ఓటీటీలో భారీ చిత్రాల విడుదల విషయంలో తెలుగు సినీ నిర్మాతల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై థియేటర్‌లో విడుదలైన పదివారాల తర్వాతే ఓటీటీకి చిత్ర ప్రదర్శన హక్కులు ఇవ్వాలని నిర్ణయించింది. కరోనా తర్వాత చిత్ర పరిశ్రమలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఆగస్టు ఒకటో తేదీ నుంచి షూటింగ్‌లను నిలిపివేయాలని నిర్మాతల మండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, తుది నిర్ణయం బాధ్యతను కమిటీకి అప్పగించారు. ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో చర్చించిన 8 కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.

నిర్మాతల మండలి తీసుకున్న నిర్ణయాలు ఇవే:

భారీ బడ్జెట్ సినిమాలను 10 వారాల తర్వాత, పరిమిత బడ్జెట్ చిత్రాలను 4 వారాల తర్వాత ఓటీటీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. రూ.6 కోట్లలోపు బడ్జెట్ చిత్రాలపై ఫెడరేషన్‌తో చర్చించాక నిర్ణయం తీసుకోవాలి.

నటులు, టెక్నీషియన్ల సమస్యల గురించి కూడా చర్చించారు. సమయ పాలన అమలు చేయాలి. దీని వల్ల అదనపు రోజులు పెరగకుండా అనుకున్న సమయానికే షూటింగ్‌లు పూర్తవుతాయి. అసిస్టెంట్‌లకు వసతి, ఇతర సౌకర్యాలు కావాలని నటులు డిమాండ్ చేయటానికి వీల్లేదు. నటీనటుల పారితోషికం నుంచే వారి సిబ్బందికి చెల్లింపు చేయాలి.

ప్రతి నిర్మాత తప్పనిసరిగా ఛాంబర్, కౌన్సిల్ నియమ నిబంధనలు పాటించాలి. ఫిల్మ్ ఛాంబర్ నిర్మాతల మండలితో చర్చించాకే సినిమా నిర్మాణ వ్యయాలు పెంచుకోవాలి.

సినిమా టికెట్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంచాలని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ప్రతిపాదించింది. నగరాలు, పట్టణాల్లో మామూలు థియేటర్లు, సి క్లాస్ సెంటర్లలో టికెట్ ధరలు రూ.100, రూ.70 (జీఎస్టీతో కలిపి)గా ఉంచాలని పేర్కొన్నారు. మల్టీప్లెక్స్‌లో జీఎస్టీతో కలిపి రూ.125 ఉండేలా ప్రతిపాదన చేశారు. మీడియం బడ్జెట్, మీడియం హీరో సినిమాలకు టికెట్ ధరలు నగరాల్లో రూ.100 ప్లస్ జీఎస్టీ ఉండాలని, అదే సి-క్లాస్ సెంటర్లలో జీఎస్టీతో కలిపి రూ.100 ఉండాలని, మల్టీప్లెక్స్‌లో అత్యధిక ధర రూ.150 ప్లస్ జీఎస్టీతో మాత్రమే ఉండాలని నిర్ణయించారు.

పని పరిస్థితులు, ధరల విషయంలో నిర్మాతల నిర్ణయం, ఆలోచనల మేరకు ఛాంబర్, కౌన్సిల్ దీనిపై తుది నిర్ణయాన్ని తీసుకుంటుంది.

- ఫైటర్స్ యూనియన్/ఫెడరేషన్ సమస్యలకు సంబంధించి ఛాంబర్, కౌన్సిల్‌లో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

నిర్మాతలను తప్పుదోవ పట్టిస్తున్న మేనేజర్లు, కో-ఆర్డినేటర్ల వ్యవస్థను రద్దు చేయాలి.

సినిమా ప్రదర్శనకు వీపీఎఫ్ (వర్చువల్ ప్రింట్ ఫీజు) ఛార్జీలు ఎగ్జిబిటర్లు చెల్లించాలని నిర్ణయించారు.

పదిమంది గుత్తపెట్టుబడిదారుల చేతుల్లో...

భారత ఆర్థిక వ్యవస్థ

ఆర్థిక సంక్షోభాలకు మార్క్సిజమే పరిష్కారం

సీపీఐ సదస్సులో ఆర్థిక వేత్త అబ్దుల్ నూర్ బాషా

విశాఖపట్నం: దేశ ఆర్థిక వ్యవస్థ కేవలం 10 మంది గుత్త పెట్టుబడిదారుల చేతుల్లోకి చేరిందని ప్రముఖ ఆర్థిక వేత్త, ఆచార్య నాగార్జున వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా అన్నారు.ఆగస్టు 26,27,28 తేదీల్లో విశాఖ నగరంలో జరుగనున్న సీపీఐ ఏపీ 27వ రాష్ట్ర మహాసభల సందర్భాన్ని పురస్కరించుకుని వై విజయ్‌కుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ప్రత్యేక సదస్సును నిర్వహించింది. సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ సదస్సులో 'భారత దేశ ఆర్థిక విధానాలు-ప్రజల ముందున్న సవాళ్లు' అనే అంశంపై అబ్దుల్ నూర్ బాషా ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా 147 దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని యూఎన్‌వోనే తెలిపిందని పేర్కొన్నారు. దేశంలో పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేయడంతో సంపద ఒక చోట పోగవుతూ సంక్షోభం ప్రబలుతోందని తెలిపారు.దేశంలో ఆర్థిక సంక్షోభం పెరగాలన్నది పాలకుల అభిమతమని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. అర్థిక సంక్షోభం పెరిగితే మతరాజ్య స్థాపన సులువవుతుందని వారు భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇదే క్రమంలో అదానీ, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు అనేక అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఒక వైపు పెట్టుబడిదారులను, బూర్జువా వర్గాన్ని కాపాడు కుంటూనే... మతతత్వాన్ని కూడా పెంపొందించేలా బీజేపీ పావులు కదుపుతోందన్నారు. రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా పాలన సాగిస్తూ బడా పెట్టుబడి దారులకు సహకరించడం చేతనే దేశ ఆర్థిక వ్యవస్థ పతనం అవుతోందని తెలిపారు. రూపాయి విలువ నిత్యం పడిపోతోందని పేర్కొన్నారు. ఈ ప్రభావం అన్ని ఇతర రంగాలపై పడుతుందని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు తగ్గుతాయని, నిత్యావసర ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు. శ్రీలంకలోని పరిస్థితులే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేయకుండా దేశంలో సమూలమైన మార్పుల్ని ఆశించలేమని పేర్కొన్నారు. దేశంలో అన్ని సమస్యలకు మార్క్సిజం పరిష్కారాలను చూపుతుందని పేర్కొన్నారు.అయితే దేశంలోని కమ్యూనిస్టు శక్తులు ఆ సిద్ధాంతాన్ని భారత దేశానికి అనుగుణంగా అన్వయించుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, విమల, సుబ్బరాజు, కసిరెడ్డి సత్య నారాయణ, ఎస్ కె రెహమాన్, పి చంద్రశేఖర్, ఆర్ శ్రీనివాసరావు, జి రాంబాబు సీపీఐ ఎంఎల్ నాయకులు వై కొండయ్య, ఎం లక్ష్మి, కె పద్మ, పుర ప్రముఖులు, వామపక్ష పార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతకు చర్యలు

తిరువనంతపురం: సైబర్ స్పేస్‌లో ఉచ్చులు, బెదిరింపుల గురించి ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు అవగాహన కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతను సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం తెలిపారు. 'స్మార్ట్ ఫోన్‌లు ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామయ్యాయి. కోవిడ్-19 అనంతర కాలంలో ఆన్‌లైన్ విద్యకు ఇది ముఖ్యమైన సాధనంగా మారింది. అందువల్ల, పిల్లలను డిజిటల్ స్పేస్‌కు ఎప్పటికీ దూరంగా ఉంచలేము. అయితే అవగాహన ద్వారా వారి భద్రతను నిర్ధారించాల్సి ఉంది' అని అన్నారు. సమాచారం తప్పుగా గుర్తించబడినప్పటికీ సోషల్ మీడియా వినియోగదారు పోస్ట్‌ను ఉంచడం సరికాదని, సోషల్ మీడియా డొమైన్‌ను నియంత్రించే వారు అలాంటి పోకడలపై నిఘా ఉంచాలని విజయన్ కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లోని చిన్నారులు, విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర పోలీసు సైబర్ డోమ్ అధ్వర్యంలో చేపట్టిన 'కూట్టు' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి ఇక్కడి కాటన్‌హిల్స్ బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాలలో మాట్లాడారు. 'కూట్టు' కార్యక్రమం బచ్‌పన్ బచావో ఆందోళన్ (బీబీఏ), రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఆన్‌లైన్ చైల్డ్ పోర్నోగ్రఫీ, పిల్లలపై ఆన్‌లైన్ నేరాల సంఘటనలను అరికట్టడానికి సంయుక్తంగా ప్రారంభించింది.

సోనియాను ప్రశ్నించిన ఈడీ

జైపూర్‌లో కాంగ్రెస్ సత్యాగ్రహం

జైపూర్: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో సోనియా గాంధీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రశ్నించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం జైపూర్‌లో సత్యాగ్రహం పేరుతో ఆందోళన నిర్వహించాయి. రాజస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతస్రా నేతృత్వంలో నగరంలోని షాహీద్ స్మారకం వద్ద జరిగిన సత్యాగ్రహంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్రం వైఖరి కారణంగా నిరాధార ఆరోపణలతో ఈడీ తమ పార్టీ అధినేతలను విచారిస్తోందని గోవింద్ సింగ్ దోతస్రా ఆరోపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.